بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

సంపుటి: **7**
సంచిక : **14**
వార్షిక చందా 575/-రూ॥

**07 ఏప్రిల్, 2022 క్రీ, శ. 05 రమజాన్ 1443 హి, ఖ. 07 షహాదత్, 1401 హి, శ.**

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَلَقَدۡ کُذِّبَتۡ رُسُلٌ مِّنۡ قَبۡلِکَ فَصَبَرُوۡا عَلٰی مَا کُذِّبُوۡا وَاُوۡذُوۡا حَتّٰۤی اَتٰٮہُمۡ نَصۡرُنَا ۚ وَلَا مُبَدِّلَ لِکَلِمٰتِ اللّٰہِ ۚ وَلَقَدۡ جَآءَکَ مِنۡ نَّبَاِی الۡمُرۡسَلِیۡنَ (سورۃ الانعام:35)

**అనువాదం:** నిశ్చయముగా నీకంటే పూర్వము కూడ ప్రవక్తలు నిరాకరించబడిరి. వారు నిరాకరించబడినను, బాధించబడినను వారికి మా సహాయం అందునంత వరకు వారు సహనంను పాటించారు. అల్లాహ్ మాటలను మార్చువాడెవడు లేడు. నిశ్చయముగా నీ వద్దకు ప్రవక్తల వార్తల వచ్చి యున్నవి. **(అన్ఆమ్: 35).**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## ఒక చక్రవర్తికి ఉండవలసిన లక్షణాలన్ని ఈ భూమండలంపై గల దేవుని పరిపాలనలో మనకు కనిపిస్తున్నాయి. ఒక్క అణువు కూడ అతని ఆదేశం నుండి బయటలేదు. అన్ని ఫలాలు అతని ఆధినములోనే ఉన్నవి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశములు:

సూరహ్ ఫాతియా అనబడే ఈ దుఆ ఇంజీల్ దుఆకన్న పూర్తి భిన్నముగా పవిత్రముగా నున్నది. ఎందుకనగా భూమండలంపై ప్రస్తుతం దేవుని సామ్రాజ్యం లేదని ఇంజీల్‌లో బోధిస్తుంది. కావున ఇంజీల్ ప్రకారముగా దేవుని కరుణా, దయా, పోషణ, మంచి చెడుల ప్రతిఫలమునిచ్చు ఏ లక్షణము భూమండలంపై పని చేయడం లేదు. అందుకు కారణం ఇప్పటి వరకు భూమండలంపై దేవుని సామ్రాజ్యం రాలేదు. కాని ఫాతిహా అధ్యాయము ప్రకారము భూమండలంపై దేవుని సామ్రాజ్యమే కొనసాగుతుంది తెలుస్తుంది. అందుకే ఫాతిహా అధ్యాయములో చక్రవర్తిత్వపు విశిష్టతలన్ని తెలుపబడినవి. ప్రజల శ్రేయస్సుకు పాటుపడే ఒక చక్రవర్తిలో ఈ విశిష్టతలన్నియు ఉండవలెనని తెలుస్తుంది. కావున ఫాతిహా అధ్యాయములో ఉన్నటు వంటి సకల లోకాల సంరక్షకుడు అనే పదం ఈ విశిష్టతకు ఊతమిస్తుంది. ఒక చక్రవర్తికి ఉండవలసిన మరొక విశిష్ట లక్ష్యణమేమనగా తమ రాజ్య ప్రజలకు, వాస్తవ్యులకు కావలసిన నిత్యవసర వస్తువులను ఎలాంటి ప్రతి ఫలం ఆశించకుండా వారికి అందుబాటులోకి తీసుకురావలెను. కావున " అర్రహ్మాన్ " అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. ఒక చక్రవర్తికి ఉండవలసిన మూడవ విశిష్ట లక్షణమేమనగా, తమ రాజ్య ప్రజలు తమ ప్రయత్నాల ద్వారా ఏదేని కార్యక్రమమును పూర్తి చేయకున్నచో, దానిని పూర్తి చేయుటకు తగిన సహాయ సహకారములను అందించవలెను. కావున " అర్రహీం" అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. ఒక చక్రవర్తికి ఉండవలసిన నాలుగో విశిష్టత ఏమిటనగా, ప్రతిఫలం నిచ్చుటకు, శిక్షించుటకు పూర్తి అధికారంను కలిగి ఉండవలెను. తద్వారా అతని రాజకీయ పరిపాలన వ్యవహారములో ఎలాంటి ఆటంకములు ఏర్పడకుండా ఉండును. కావున " మాలిక్ యౌమిద్దీన్" అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. సారంశమేమనగా పైన తెలుపబడిన అధ్యాయములో ఒక చక్రవర్తికి ఉండవలసిన విశిష్టతలన్నింటిని ప్రస్తావించడం జరిగింది. వీటి ద్వారా తెలుయునదేమనగా ఈ భూమండలంపై దేవుని సామ్రాజ్యం మరియు అతని చక్రవర్తిత్వం గలదు. కావున ఈ భూమండలంపై అతని రబూబియత్ (సంరక్షణ) గలదు, అతని రహ్మానియత్ (కరుణా) గలదు, అతని రహీమియ్యత్ (దయాగుణం) గలదు. ఆపై సహాయము నందించు పరంపర కూడ గలదు. శిక్షించు పరంపర కూడ గలదు. ఒక విధముగా చెప్పదలచినచో ఒక చక్రవర్తికి ఉండవలసిన లక్షణాలన్ని ఈ భూమండలంపై గల దేవుని పరిపాలనలో మనకు కనిపిస్తున్నాయి. ఒక్క అణువు కూడ అతని ఆదేశం నుండి బయటలేదు. అన్ని ఫలాలు అతని ఆధినములోనే ఉన్నవి. అన్ని కరుణలు అతని చేతులలోనే ఉన్నవి. కాని ఇంజీల్ మాత్రం దేవుని సామ్రాజ్యం ఇంకా మీలో స్థిరపడలేదని, దాని రాకకోసం మీరు దేవున్ని యాచించండి, ఫలితముగా అది వస్తుందని నేర్పుతుంది. అనగా ఇప్పటి వరకు వారి దేవుడు ఈ భూమండలానికి యజమాని కాదు, అతని రాజ్యం ఇక్కడలేదు. అలాంటప్పుడు అలాంటి దేవుడి నుండి ఏమి ఆశించగలము. కావున వినండి, అర్థం చేసుకోండి, ఇందులోనే గొప్ప విజ్ఞత గలదు. ఏ విధముగానైతే ఆకాశపు అణువణువు దేవుని చక్రవర్తిత్వంలో ఉన్నదో అదే విధముగా భూమండలపు అణువణువు కూడ దేవుని ఆధీనంలో, అధికారంలోనే ఉన్నది. ఏ విధముగానైతే ఆకాశంలో అతనికి వైభవోపేతమైన ప్రాచుర్యమున్నదో అదే విధముగా ఈ భూమండలంపై కూడ అతనికి వైభవోపేతమైన ప్రాచుర్యమున్నది. ఆకాశపు ప్రాచుర్యం ఒక విశ్వాస ప్రక్రియ. సాధారణ వ్యక్తులెవరు ఆకాశముపైకి వెళ్ళి ఆ ప్రాచుర్యమును వీక్షించలేదు. కాని భూమండలంపై దేవుని చక్రవర్తిత్వపు ప్రాచుర్యం గలదు. అది ప్రతి ఒక్కరి కన్నులకు ఎంతో స్పష్టముగా కనుపించును. ప్రతి వ్యక్తి అతడు ఎంతటి ధనవంతుడైనను, అతని అభిరుచికి భిన్నముగా మరణపు ద్రావణంను త్రాగవలసినదే. ఆ చక్రవర్తి యొక్క స్వచ్ఛమైన ఆదేశపు ప్రభావం ఈ భూమిపై ఏ విధముగా ఉందో చూడండి. అతని ఆదేశము వచ్చినచో ఏ ఒక్కరు కూడ తమ మరణంను ఒక్క క్షణంపాటు పొడిగించుకోలేరు. అతి భయంకరమైన, చికిత్స రహిత రోగాలు వచ్చినచో వాటికి ఏ వైద్యుడు కూడ చికిశ్చ చేయలేడు. కావున రద్దు కాబడనటువంటి అతని ఆదేశమును చూసి దేవుని చక్రవర్తిత్వపు ప్రభావం ఈ భూమండలంపై ఎంతగా ఉన్నదో ఒక్కసారి ఆలోచించండి. అలాంటప్పుడు దేవుని రాజ్యం ఈ భూమండలంపై ప్రస్తుతం లేదని, రాబోవు కాలంలో ఏర్పడునని ఎందుకు ప్రచారం చేస్తున్నారు?. ఈ కాలంలో దేవుని ఆకాశ ఆదేశం ప్లేగ్ వ్యాధి రూపంలో ఏ విధముగా భూమండలంను కుదుపుతుందో చూడండి. ఫలితముగా ఇది అతని మసీహ్ మౌవూద్ కొరకు ఒక సంకేతముగా నిలుచును. అతని ఆకాంక్ష లేకుండానే దీనిని దూరం చేయువారెవరు. అయినా కూడ భూమిపై అతని రాజ్య స్థాపన జరగలేదని ఎందుకంటున్నారు. హాఁ! ఒక దుష్టుడు ఈ భూమండలంపై ఒక ఖైది వలే జీవితంను గడువును. పైగా ఎన్నడు మరణించ కూడదని కోరుకుంటాడు. కాని దేవుని స్వచ్ఛమైన సార్వభౌమాధికారం అతనిని నాశనం చేస్తుంది. అలా చివరికి ఆ దుష్టుడు మృత్యువు ఒడిలోకి చేరుకొనును. అయినా కూడ భూమిపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు. చూడండి! దేవుని ఆదేశంతో ఈ భూమిపై ఒక్క క్షణంలోనే కొన్ని కోట్ల మంది మానవులు మరణిస్తారు, అతని కోరిక మేరకు కోట్లాది మంది జన్మిస్తుంటారు. కోట్లాది మంది అతని అభిష్టము మేరకు పేదరికం నుండి సంపన్నులుగా, సంపన్నుల నుండి పేదవారిగా పరివర్తనం చెందుతుంటారు. అయినా కూడ భూమిపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు. ఆకాశంలో కేవలం దేవదూతలే ఉంటారు. కాని భూమండలంపై మానవులతో పాటు దేవునికి సహాయకులుగా, అతని సామ్రాజ్యంనకు సేవకులుగా మరియు మానవుల వివిధ రకాల పనులను కాపాడుటకు దేవదూతలుంటారు. వారు ఎల్లప్పుడు దేవుని పట్ల విధేయతను కనబరుస్తారు.

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

(1885) హజ్రత్ అనస్ రజి యల్లాహ్ అన్హు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఆధారం చేసుకొని ఇలా తెలిపారు: హుజూర్ (స) ఇలా దుఆ చేశారు. ఓ అల్లాహ్ ! నీవు మక్కా అనుగ్రహించిన విధముగా మదీనాలో కూడ రెట్టింపు శుభములను అనుగ్రహించుము.

(1886) హజ్రత్ అనస్ రజి ఇలా తెలిపారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని ప్రయాణం నుండి తిరిగి వస్తున్న క్రమంలో మదీనా గోడలు కనిపించగానే మదీనాపై గల ప్రేమవలన తమ ఒంటెను వేగంగా నడిపించేవారు, లేదా మరేదైన జంతువుపై స్వారి చేయుచున్నచో దానిని కూడ పరుగెత్తించెదరు.

(1887) హజ్రత్ అనస్ రజి ఇలా తెలిపారు: బనూ సల్మా వారు తమ ప్రాంతాన్ని వీడి మదీనాకు సమీపంలో జీవించాలని సంకల్పించుకోగా మదీనాకు ఒకవైపు ఖాళిగా ఉండడాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అయిష్ట పడ్డారు. ఆపై ఇలా అన్నారు. ఓ బనూ సల్మా! మీరు మీ అడుగులకు పుణ్యాన్ని కోరుకోవడం లేదా అని అడిగారు. ఫలితముగా వారు అక్కడే నివాసమున్నారు.

నోట్: హజ్రత్ సయ్యద్ జైనులాబిద్దీన్ వలి ఉల్లాహ్ షా రజి గారు ఈ హదీస్‌ను విశ్లేషిస్తూ ఇలా తెలిపారు: ఉహద్ ప్రక్కన బనూ సల్మా, బనూ హారిసా అనే రెండు తెగలు ఉండేవి.వారి ప్రాంతాలు దియారే బనూ సల్మా, దియారే బనూ హారిసా అనే పేర్లతో ప్రాచుర్యాన్ని పోందాయి. బనూ సల్మా వారు నమాజ్‌లలో సులువుగా భాగస్వాములవడం కోసం మదీనాకు సమీపంలో ఉండాలని ఆలోచించుకున్నారు. కాని రక్షణ పరంగా వారు వారి ప్రాంతాలలోనే ఉండడాన్ని ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇష్టపడ్డారు. (బుఖారి).

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

హజ్రత్ అబూబకర్ రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి తమ ఒక కలను వినించి ఇలా విన్నవించుకుంటారు. ఓ రసూలుల్లాహ్(స)! నాకు ఒక కల వచ్చింది. నేను కలలో మనం మక్కాకు సమీపంలో ఉండడాన్ని చూశాను. అంతలోనే ఒక కుక్క అరుస్తు మన వైపు వస్తుంది. కాని మనం దానివైపు వెళ్ళినప్పుడు అది తోక ముడ్చుకొని కూర్చున్నది. దాని నుండి పాలు కారడం ప్రారంభమైయ్యాయి. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: అనగా వారి దుష్టత్వములు దూరమై వారి మంచితనములు సమీపిస్తున్నాయని అర్థం. వారు మీ సమీప బందుత్వంను అడ్డుపెట్టుకొని మీ అభయంలోకి వస్తారు. వారిలో కొందరిని మీరు కలుస్తారు.

హజ్రత్ అలీ రజి ఉల్లేఖించారు. హజ్రత్ అబూబకర్ రజి అర్ఫా ప్రాంతానికి వచ్చి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వారు రజి ప్రసంగాన్ని ముగించిన తరువాత నా వైపు చూస్తూ ఓ అలీ ! లేచి నిలబడుము. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సందేశాన్ని వినిపించుము అని అన్నారు. కావున నేను నిలబడి వారి ముందు బరాఅ అధ్యాయపు మొదటి 40 సూక్తులను చదివి వినిపించాను. ఆ తరువాత వారు ఇరువురు హజ్రత్ అలీ రజి మరియు హజ్రత్ అబూబకర్ రజిలు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్నారు.

గౌ॥అమతుల్ లతీఫ్ ఖుర్షీద్ గారిది. వీరు కెనడాలో ఉంటున్నారు. షేక్ ఖుర్షీద్ అహ్మద్ అసిస్టెంట్ ఎడిటర్ అల్ ఫజల్ రబ్వా గారి శ్రీమతి. 95 సంవత్సరాల వయస్సులో వీరు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వీరు వసియ్యత్ చేశారు.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 11 ఫిబ్రవరి 2022, (11 తబ్లీఘ్ 1401 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

మక్కా విజయంను గూర్చి చరిత్రలో చూసినట్లైతే హజ్రత్ అబూబకర్ రజి ఒక కల గుర్తుకు వస్తుంది. దానిని గూర్చి ఈ విధముగా పేర్కొనబడింది. హజ్రత్ అబూబకర్ రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి తమ ఒక కలను వినించి ఇలా విన్నవించుకుంటారు. ఓ రసూలుల్లాహ్(స)! నాకు ఒక కల వచ్చింది. నేను కలలో మనం మక్కాకు సమీపంలో ఉండడాన్ని చూశాను. అంతలోనే ఒక కుక్క అరుస్తు మన వైపు వస్తుంది. కాని మనం దానివైపు వెళ్ళినప్పుడు అది తోక ముడ్చుకొని కూర్చున్నది. దాని నుండి పాలు కారడం ప్రారంభమైయ్యాయి. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: అనగా వారి దుష్టత్వములు దూరమై వారి మంచితనములు సమీపిస్తున్నాయని అర్థం. వారు మీ సమీప బందుత్వంను అడ్డుపెట్టుకొని మీ అభయంలోకి వస్తారు. వారిలో కొందరిని మీరు కలుస్తారు. ఆః హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ కలకు ఆ విధమైన అర్థాన్ని తెలిపారు. ఆపై ఇలా కూడ అన్నారు. ఒకవేళ మీరు అబూసుఫ్యాన్ ఆధీనపర్చుకున్నచో అతనిని మీరు చంపకూడదు.

ఈ క్రమంలోనే ముసల్మానులు అబూసుఫ్యాన్ మరియు హకీం బిన్ హిజామిలను వారు మర్రుజ్జహ్రాన్‌లో ఆదీనపర్చుకున్నారు. (దలాయిలే నబువ్వత్, లిల్ బెహఖీ, సంపుటి 5, పుట 48, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్ 1988)

ఇబ్నే ఉక్బా ఇలా ఉల్లేఖించారు: అబూసుఫ్యాన్ బిన్ మరియు హకం బిన్ హిజామ్‌లు తిరిగి వెళ్ళుచుండగా హజ్రత్ అబ్బాస్ రజి వారిని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి తీసుకవెళ్ళి ఇలా విన్నవించుకున్నారు. ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం! అబూసుఫ్యాన్ ఇస్లాంను స్వీకరించు విషయంలో నాకు భయంగా ఉన్నది అని అన్నారు. ఈ విషయాన్ని నేను ఇంతకు ముందుకూడ అనగా ఏ విధముగా అబూసుఫ్యాన్ ఆః హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయతను స్వీకరించారు, ఇస్లాం వైభవాన్ని ఏ విధముగా కొనియాడారు అని వివరముగా తెలిపారు. మొత్తానికి హజ్రత్ అబ్బాస్ రజి ఇలా అన్నారు. అతనిని తిరిగి తీసుకరమ్ము, అతడు ఇస్లాంను గూర్చి అర్థం చేసుకొనును మరియు ఆః హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఉన్నటు వంటి అల్లాహ్ సైన్యాన్ని కూడ తిలకించును. మరొక కథనములో ఈ విధముగా గలదు. ఇబ్నే అబీ షైయిబా ఇలా ఉల్లేఖించారు. అబూసుఫ్యాన్ తిరిగి వెళ్ళి పోవుచుండగా హజ్రత్ అబూబకర్ రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధిలో ఇలా విన్నవించుకున్నారు. ఓ రసూలుల్లాహ్ (స) ఒకవేళ మీరు అబూసుఫ్యాన్ విషయంలో ఆదేశించినచో మేము అతనిని మార్గమధ్యలోనే అడ్డుకుంటాము. మరొక కథనములో ఈ విధముగా గలదు. ఇబ్నే ఇస్హాఖ్ ఇలా ఉల్లేఖించారు. అబూసుఫ్యాన్ తిరిగి వెళ్ళుచుండగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబ్బాస్ రజితో ఇలా అన్నారు. అతనిని అనగా అబూసుఫ్యాన్‌ను లోయ ప్రాంతానికి చెందిన గుట్టల మధ్యలో అడ్డుకొనుము అని ఆదేశించారు. కావున హజ్రత్ అబ్బాస్ రజి అబూసుఫ్యాన్‌ను అడ్డుకున్నారు. అందుకు అబూసుఫ్యాన్ ఇలా అన్నాడు. ఓ హాషిం కుమారులారా! మీరు మోసం చేస్తున్నారా?. అప్పుడు హజ్రత్ అబ్బాస్ రజి ఇలా అన్నారు. దైవ ప్రవక్త కుటుంబీకులు మోసం చేయరు. మరొక కథనములో ఈ విధముగా గలదు. మేము ఎన్నడు మోసం చేయము. కాని నీవు ఉదయం వేళ వరకు ఇక్కడే ఎదురుచూస్తు ఉండుము. ఫలితముగా అల్లాహ్ సైన్యంను నీవు చూడగలవు. అల్లాహ్ అన్యారాధుల కొరకు ఏర్పాటు చేసిన సైన్యాన్ని చూడుము. అని అన్నారు. అలా మొత్తానికి హజ్రత్ అబ్బాస్ రజి అబూసుఫ్యాన్‌ను ఆ లోయ ప్రాంతంలోనే ఉదయం వరకు అడ్డుకున్నారు. (సుబూలుల్ హుదా సంపుటి 5, పుట 218, ఫి ఘుజ్వతుల్ ఫతహ్ అజీం.. దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్ 1993)

ఇస్లామీయ సైన్యం అబూసుఫ్యాన్ ముందు నుండి కదులుచుండగా ఆ దృశ్యాన్ని వర్ణిస్తూ సుబులుల్ హుదా వర్రిషాద్‌లో ఈ విధముగా పేర్కొన్నారు. అబూసుఫ్యాన్ ముందు నుండి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆకుపచ్చ వస్త్రములను ధరించిన సైన్యం వెళ్ళసాగింది. ఆ సైన్యంలో ముహాజిర్లు మరియు అన్సారుల్ ఉన్నారు. అన్సార్‌కు చెందిన ప్రతి తెగవారి వద్ద ఒక పతాకం, ఒక జండా ఉన్నది. పైగా వారు ఇనుప వస్త్రాలను ధరించి ఉన్నారు. అనగా కవచం వంటి యుద్ధ వస్త్రాలను ధరించి ఉన్నారు. కేవలం వారి కన్నులు మాత్రమే కనిపిస్తున్నాయి. వారిలో అప్పుడప్పుడు హజ్రత్ ఉమర్ రజి మాటలు గట్టి గట్టిగా వినబడుతున్నాయి. వారు ఇలా అంటున్నారు. నెమ్మదిగా నడవండి. మీ ముందు భాగం వారు కూడ మీ చివరి భాగం వారితో అనుసంధానమై ఉండాలి. ఆ సైన్యం సుమారు వెయ్యి మంది ఇనుప వస్త్రాలను ధరించినట్లు పొందుపరిచారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ పతాకంను సఅద్ బిన్ ఉబాదహ్ రజికు అనుగ్రహించారు. వారు రజి సైన్యానికి ముందు వరుసలో ఉన్నారు. హజ్రత్ సఅద్ అబూసుఫ్యాన్ ముందుకు రాగానే వారు అబూసుఫ్యాన్ పిలిచి ఈ రోజు రక్త పాతం సృష్టించు రోజు . ఈ రోజు నిషేదించబడినవన్నియు అనుమతించబడును. ఈ రోజు ఖురైషులు తప్పకుండా అవమానించ బడుతారు అని అన్నారు. అప్పుడు ఆ విషయాన్ని అబూసుఫ్యాన్ హజ్రత్ అబ్బాస్ రజికు వినిపించి ఇలా అన్నాడు. ఓ

అబ్బాస్ ! ఈ రోజు నన్ను కాపాడ వలసిన బాధ్యత నీపై ఉన్నది. ఆ తరువాత ఇతర తెగలకు చెందిన వారు కూడ అక్కడి నుండి ముందుకు వెళ్ళారు. ఆ తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వచ్చారు. ఆ సమయంలో హుజూర్ (స) తమ ఒంటె ఖస్వాపై స్వారీ చేస్తున్నారు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూబకర్ రజి మరియు హజ్రత్ ఉసయ్యద్ బిన్ హుజైర్ రజిల మధ్యలో ఉండి వారి ఇరువురితో మాట్లాడుతూ ముందుకు సాగుచున్నారు. హజ్రత్ అబ్బాస్ రజి అబూసుఫ్యాన్‌తో వీరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అని అన్నారు.

(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 5, పుట 220-221, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెవ్‌రూత్ లిబ్నాన్ 1993)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా విజయం రోజున మక్కాలోకి ప్రవేశించుచున్న సమయంలో మక్కా మహిళలు గుర్రాలపై తమ చున్నీలను వేసి వాటిని వెనుకకు వెళ్ళగొడుచున్నారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని చూసి చిరునవ్వు చిందిస్తూ హజ్రత్ అబూబకర్ రజి వైపు చూస్తు ఇలా అన్నారు. ఓ అబూబకర్ రజి! హస్సాన్ బిన్ సాబిత్ ఏమన్నాడు? అని అడిగారు. అందుకు హజ్రత్ అఅబూబకర్ రజి వారి పద్యాన్ని చదివి వినిపించారు.

అదిమ్‌తు బునయ్యతి ఇన్ లం తరౌహా

తుసీరున్నఖ్అ మౌఇదహా కదాఉ

యునాజిఇనల్ అ ఇన్నత ముస్‌రిహాతిన్

యులత్తిముహున్న బిల్ హుమురిన్నిసాఉ

ఒకవేళ మీరు దుమ్మును రేపుతూ వస్తున్నటు వంటి సైన్యంను చూడనిచో నేను నా ప్రియమైన కుమార్తేను పోగొట్టుకుంటాను. వారు కదా పర్వతశ్రేణిలో బస చేస్తారని వాగ్దానం చేయబడింది. వారు వేగంగా పరుగెత్తున్నటి తమ గుర్రాల ముక్కుతాడులను లాగుతారు. మహిళలు వాటిని తమ చున్నీలతో వెనుకకు మళ్ళించును. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. ఈ హస్సాన్ చెప్పిన ప్రదేశం నుండియే ఈ నగరంలోకి ప్రవేశించుము. అనగా కదాఅ ప్రాంతం నుండి. (సుబూలుల్ హుదా వర్రిషాద్, ఫీ సీరతు ఖైరుల్ ఇబాద, సంపుటి5, పుట 227, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ లిబ్నాన్ 1993)(షరఅ జర్కాని, సంపుటి 3, పుట 415, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ లిబ్నాన్ 1996)

ఇర్ఫాత్ ప్రాంతానికి గల మరొక నామమే కదాఅ. ఇది ఒక పర్వత మార్గం. మక్కాయేతరులు మక్కాలోకి ఈ మార్గం గుండానే ప్రవేశిస్తారు. మక్కా విజయం రోజున ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ ఈ మార్గం గుండానే మక్కాలోకి ప్రవేశించారు.

((ఫ్రాంగ్ సీరత్, పుట 242, జవాహిర్ అకాడమి, కరాచీ 2003)

మక్కా విజయ సందర్భమున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అభయ ప్రకటన చేయగా, హజ్రత్ అబూబకర్ రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఓ రసూలుల్లాహ్ (స)! అబూ సుఫ్యాన్ కూడ మంచితనాన్ని ఇష్టపడుతాడు అని విన్నవించుకున్నారు. అందుకు హుజూర్ (స) ఎవరైతే అబూసుఫ్యాన్ గృహంలోకి ప్రవేశిస్తారో వారు కూడ అభయాన్ని పొందుతారు అని ప్రకటన చేశారు. (షరఅ జర్ఖాని అలల్ మవాహిబ్ లిద్దునియా సంపుటి 3, పుట 421, బాబ్ ఘజ్వతుల్ ఫతహుల్ అజీం, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1996)

మక్కాను జయించిన తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హుబుల్ విగ్రహాన్ని గూర్చి ఆదేశించారు. ఫలితముగా హుజూర్ (స) ఎదురుగా ఉండగానే ఆ విగ్రహాన్ని కూల్చివేయడం జరిగింది. అప్పుడు హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్ రజి అబూసుఫ్యాన్‌తో ఇలా అన్నారు. ఓ అబూసుఫ్యాన్ హుబుల్ విగ్రహాన్ని కూల్చివేయడం జరిగింది. కాని మీరు ఉహద్ యుద్ధంలో ఆ విగ్రహం మిమ్ములను అనుగ్రహించిందని ఆ విగ్రహాన్ని గూర్చి చాలా గర్వముగా మాట్లాడినారు. అందుకు అబూసుఫ్యాన్ ఇలా అన్నాడు. ఓ అవ్వామ్! ఆ విషయాలను ఇక వదిలి వేయుము. ఎందుకనగా ఒకవేళ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి దైవం కాకుండా మరో దైవం ఉన్నట్లైతే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదని మేము గ్రహించాము.

ఆ తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాన కాబా యొక్క ఒక మూలకు కూర్చున్నారు. ప్రజలు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు గుమికూడారు. హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా తెలిపారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా విజయం రోజున మక్కాలోకి ప్రవేశించారు. హజ్రత్ అబూబకర్ రజి ఖడ్గమును చేత పట్టుకొని రక్షణగా హుజూర్ (స) ప్రక్కన నిలిచున్నారు.

(సులూల్ హుదా వర్రిషాద్, సంపుటి 5, పుట 235, ఫి ఘజ్వతుల్ ఫతహల్ అజీం, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ లిబ్నాన్ 1993)

ఘజ్వా హునైన్‌ను గూర్చిన ప్రస్తావన ఈ విధముగా గలదు. హునైన్ యుద్ధంనకు హవాజిన్ మరియు అవ్‌తాస్ యుద్ధాలని పేర్లు గలవు. హునైన్ మక్కా మరియు తాయిఫ్‌ల మధ్య మక్కా నుండి 30 మైళ్ళ దూరంలో ఒక లోతట్టు ప్రాంతంలో ఉన్నది. హునైన్ యుద్ధం హిజ్రి 8వ సంవత్సరం షవ్వాల్ మాసంలో జరిగింది. ఈ విధముగా ఉల్లేఖించబడింది. అల్లాహ్ తాలా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు మక్కా విజయం ప్రసాదించిన తరువాత హవాజిన్ నాయకులు మరియు సఖీఫా నాయకులు పరస్పరం కలుసుకున్నారు. పైగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎక్కడ వారితో యుద్ధం చేస్తారో అని భయపడసాగారు. (సీరతుల్ హల్బియతు, సంపుటి 3, బాబ్ జికర్ ముఘాజియా, ఘజ్వా హునైన్, పుట 151, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ 2002)(ఇట్లస్ సీరతునబ్వీ పుట 409, దారుల్ ఇస్లాం రియాజ్ 1424 హిజ్రి)

మాలిక్ బిన్ ఔఫ్ నస్రి అరబ్ తెగల వారిని ఏకం చేశాడు. ఈ క్రమంలోనే హవాజిన్ , బనూ సఖీఫా మరియు బనూ నసర్ మరియు బనూ హుషం, సఅద్ బిన్ బకర్ మరియు బనూ హిలాల్ తెగలకు చెందిన కొంత మంది అతని నాయకత్వంలో ఏకమయ్యారు. (సీరత్ ఇబ్నే హష్షామ్, పుట 761, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ 2001)

వీరందరు ఔతాస్ ప్రాంతంలో ఏకమయ్యారు. ఔతాస్ కూడ హునైన్‌కు సమీపం లో ఉన్నటు వంటి మరో లోతట్టు ప్రాంతం. మాలిక్ బిన్ ఔఫ్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను గూర్చిన సమాచారం తెలుసుకోవడానికి తమ గూఢచారులను పంపించాడు. మరోవైపు వారు ఏకమవుచున్నారనే విషయం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియగానే హుజూర్ (స) అబ్దుల్లాహ్ బిన్ అబూ హద్‌రజ్‌సల్మీ అనే ఒక అనుచరుడిని వారి సమాచారం తెలుసుకోవడానికి పంపించారు. ఆ తరువాత ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హవాజిన్ తెగవారితో పోరాడుటకు బయలు దేరాలని నిశ్చయించుకున్నారు. ఈ యుద్ధం కోసం సఫ్వాన్ బిన్ ఉమయ్య మరియు తమ పిన్నాన్న కుమారుడైన నౌఫిల్ బిన్ హారిస్ నుండి ఆయుధాలను బదులుగా తీసుకున్నారు. ఆ విధముగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం 12వేల మంది సైనికులతో హవాజిన్ తెగవారితో పోరాడుటకు ఉదయం వేళ హునైన్ ప్రాంతానికి చేరుకున్నారు. ఆ తరువాత ఆ లోతట్టు ప్రాంతంలోకి ప్రవేశించసాగారు. కాని అన్యారాధులు ముందుగానే ఆ లోతట్టు ప్రాంతంలో దాక్కున్నారు. కావున వారు ఒక్కసారిగా ముసల్మానులపై దాడి చేశారు. ఎంత తీవ్రముగా బాణాలతో యుద్ధం చేశారసగా వారి తీవ్రతను తట్టుకోలేక ముసల్మానులు వెనుదిరిగి పారిపోవడం, చెల్లా చెదరు కావడం కూడ జరిగిపోయింది. ఆ కారణంగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమీపంలో కేవలం చాలా తక్కువ మంది అనుచరులే ఉండిపోయారు. వారిలో హజ్రత్ అబూబకర్ రజి కూడ ఉన్నారు. (సీరతుల్ హల్బియా, సంపుటి 3, పుట 151-154, బాబ్ జికర్ ముఘాజియా ఘజ్వా హునైన్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2002)( ఫ్రాంగ్ సీరత్ పుట 49, జవార్ అకాడమి, కరాచి 2003)

అబూ ఇస్‌హాఖ్ ఈ విధముగా ఉల్లేఖించాడు: ఒక వ్యక్తి బరాఅ వద్ద వచ్చి హునైన్ రోజున మీరు పారిపోయి వచ్చారా? అని అడిగాడు. అందుకు వారు నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను గూర్చి సాక్ష్యమిచ్చెదను హుజూర్ (స) వెనుదిరుగలేదు. కాని కొంత మంది తొందరపాటు గలసైనికులు, ఆయుద రహితులైన సైనికులు హవాజిన్ తెగవారి వైపునకు వెళ్ళగా వారు విల్లుకారులైనందున వారు గొళ్ళబామాల వలే బాణాల వర్షం కురిపించారు. ఆ తీవ్రతకు తట్టుకోలేక వారు అక్కడి నుండి పారిపోయి వచ్చారు. (సహి ముస్లిం, కితాబుల్ జిహాద్ వస్సిరియా బాబ్ ఫి ఘజ్వతు హునైన్ హదీస్ 4616)

అట్టి పరిస్థితులలో ముహాజిర్లలో హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ ఉమర్ రజిలు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు నిలకడగా ఉండి పోదారు.

అదే విధముగా హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం వంశంలో హజ్రత్ అలీ రజి, హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ రజి మరియు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి పిన్నాన్న అబూసుఫ్యాన్ బిన్ హారిస్ మరియు వారి కుమారుడు , హజ్రత్ ఫజల్ బిన్ అబ్బాస్ మరియు రబియా బిన్ హారిస్ ఉసామ బిన్ జైద్‌లు కూడ హుజూర్ (స)కు తోడుగా నిలకడగా ఉండి పోరాడారు. (సీరతున్నబవియ్యతు లి ఇబ్నే హష్షామ్, పుట 764, ఘజ్వా హునైన్ సిబాత్ రసూల్ వ బఅజు అస్‌హాబు, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2001)

హజ్రత్ అబూఖతాదహ్ రజి ఇలా ఉల్లేఖించారు: హునైన్ యుద్ధ సమయంలో ఒక ముసల్మానుడు ఒక అన్యారాధుడితో పోరాడుచున్నాడు. మరొక అన్యారాధుడు మోసపూరితముగా ఆ ముసల్మానుడిపై వెనుక నుండి దాడి చేసి హతమార్చుటకు దాక్కున్నాడు. అది గమణించిన నేను మోసపూరితముగా ఆ ముసల్మానుడిని హతమార్చాలనుకున్న వ్యక్తి వైపు వెంటనే వెళ్ళాను. అతడు నాపై దాడి చేయుటకు చేయి ఎత్తగా నేను అతని చేతిపై దాడి చేశాను. ఫలితముగా అతని చేయి తెగిపోయింది. అయినా కూడ అతడు నన్ను గట్టిగా పట్టుకొని ఊపిరి ఆడకుండా చేయాలని చూశాడు. నేను నిస్సహాయుడినైపోయాను. ఆ తరువాత కొంత సమయానికి అతడు నన్ను వదిలి వేశాడు. అతడు బలహీనుడైనాడు. అప్పుడు నేను అతనిని నెట్టివేశాను. ఆ తరువాత నేను అతనిని హతమార్చాను. మరోవైపు పరిస్థితిని చూసినచో ముసల్మానులు యుద్ధ తీవ్రతను తట్టుకోలేక పారిపోసాగారు. నేను కూడ వారితో కలసి పారిపోయాను. మరల ఇలా తెలిపారు. ఆ తరువాత కొంత సమయానికి మరల ప్రజలు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు ప్రక్కల ఏకం కావడం ప్రారంభించారు. ఆ తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏ వ్యక్తి అయినా ఎవరినైన హతమార్చినట్లుగా సాక్ష్యంను చూపెట్టినచో అట్టి మృతుని సామాగ్రి ఆ వీరుడికి చెందుతుందని ప్రకటన చేశారు. ఈ క్రమంలో నేను లేచి నిలబడ్డాను. నేను హతమార్చిన వ్యక్తిని గూర్చి ఎవరైన సాక్షి ఉన్నారా? అని చూడగా నాకు సాక్ష్యం ఇవ్వడానికి ఎవరు కనిపించలేదు. కావున నేను ఏమి చేయలేక కూర్చున్నాను. ఆ తరువాత నాకు ఆలోచన వచ్చింది. కావున నేను ఆ విషయాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలిపాను. ఆ సమయంలో హుజూర్ (స) ప్రక్కన కూర్చున్నటు వంటి ఒక వ్యక్తి లేచి ఏ మృతుని గూర్చి ఈ వ్యక్తి తెల్పుచున్నాడో అతని ఆయుధాలు నా వద్దనే ఉన్నాయి అని వివరించాడు. ఆపై మరల ఆ వ్యక్తి అనగా ఎవరి వద్దనైతే ఆ మృతుని ఆయుధాలు ఉన్నాయో అతడు ఇలా అన్నాడు. ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆయుధాలకు బదులుగా మీరు మరోక సామాగ్రిని ఆ వ్యక్తికి ఇచ్చి సంతృప్తి పర్చండి అని విన్నవించుకున్నాడు. అనగా నా వద్ద ఉన్నటు వంటి సామాగ్రిని నా వద్దనే ఉండనీయండి. అతనికి వేరొక వస్తువును ఇవ్వండి అని అన్నాడు. హజ్రత్ అబూబకర్ రజి కూడ అక్కడే కూర్చొని ఉన్నారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ రజి హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖురైష్‌లకు చెందిన ఒక పిరికి వానికి సామాగ్రిని ఇప్పించి, అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వైపు నుండి పోరాటం చేయు దైవ సింహాలలో ఒక సింహానికి ఏమి ఇవ్వకపోవడమనేది అలా ఎన్నడు జరుగదు అని అన్నారు. హజ్రత్ అబూ ఖతాదహ్ రజి ఇలా అన్నారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం లేచి నిలబడ్డారు. ఆపై హుజూర్ (స) ఆ ఆయుధాలను నాకు ఇప్పించారు. వాటిని విక్రయించి నేను ఒక ఖర్జూర తోటను కొనుగోలు చేశాను. ఇస్లాంను స్వీకరించిన తరువాత నేను సంపాదించిన ఈ తోటయే నా మొదటి ఆస్తి.

(సహి బుఖారి, కితాబుల్ మఘాజి, బాబ్ ఖౌలిల్లాహి తాఆల వ యౌమ హునైన్ హదీస్ 4322)

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు ఈ విధముగా తెల్పుచున్నారు. పరిశీలన దృష్టితో చూసినచో చరిత్ర ద్వారా తెలియునదేమనగా, హునైన్ యుద్ధ సమయంలో మక్కాకు చెందిన అవిశ్వాస సైన్యం ఈ రోజు మా వీరత్వంను ప్రదర్శిస్తాము అని ప్రగల్భాలు పలుకుతూ ఇస్లామీయ సైన్యంతో కలసి యుద్ధంలో పాల్గొన్నది. కాని బనూ సఖీఫ్ తెగ వారి దాడులను తట్టుకోలేక యుద్ధ మైదానం నుండి పారిపోయింది. ఆ సందర్భములో ఒకానొక సమయంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టూ కేవలం 12 మంది అనుచరులు మాత్రమే ఉన్నారు. ఇస్లామీయ సైన్యం 10వేల సంఖ్యలో ఉన్నప్పటికి వారు కేవలం ఉరుకులు పరుగులకు మాత్రమే పరిమితమయ్యారు. అవిశ్వాసుల సైన్యం కేవలం 3 వేల మంది విల్లుకారులు మాత్రమే. వారు హుజూర్ (స) కుడి, ఎడమల వైపు ఉన్నటు వంటి గుట్టలపై ఎక్కి హుజూర్ (స) పై బాణాలు వేయసాగారు. అయినా కూడ హుజూర్ (స) ఆ సమయంలో వెనుకడుగు వేయలేదు. పైగా ముందుకే వెళ్ళసాగారు. హజ్రత్ అబూబకర్ రజి ఆందోళన చెంది హుజూర్ (స) గుర్రపు కళ్ళెము పట్టుకోని, ఓ రసూలుల్లాహ్ స ! నా ప్రాణాలు మీకు అర్పించెదను. ఇది ముందుకు వెళ్ళే

సమయం కాదు. త్వరలోనే మన సైన్యం మరల ఏకమవుతుంది. అప్పుడు మనం ముందుకు వెళ్దాం అని విన్నవించుకున్నారు. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం చాలా వీరత్వంను ప్రదర్శిస్తూ నా గుర్రపు కళ్ళెమును విడిచిపెట్టుము అని ఆదేశించి ఇంకా ముందుకు వెళ్ళారు. అలా ముందుకు వెళ్ళుచూ అనాఅన్నబియ్యు లా కజిబ్ అనా ఇబ్ను అబ్దుల్ ముత్తలిబ్ అనగా నేను వాగ్దాత ప్రవక్తను, నన్ను శాశ్వతముగా రక్షించెదననే వాగ్దానం ఉన్నది. నేను అసత్యుడిని కాను. అందుకే మీరు 3వేల మంది విల్లుకారులైనను, 30 వేల మంది విల్లుకారులైనను నాకు ఎలాంటి అభ్యంతరం లేదు అని అన్నారు.

మరల ఓ అన్యారాధులారా! మీరు నా ఈ వీరత్వంను చూసి నన్నే మీరు దేవుడిగా భావించకండి. నేను కేవలం మానవున్ని మీ నాయకుడైన అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడిని అనగా మనువడిని.

హుజూర్ (స) పిన్నాన్న హజ్రత్ అబ్బాస్ రజి పెద్ద గొంతుగలవారు. హుజూర్ (స) వారివైపు చూస్తూ ఇలా అన్నారు. ఓ అబ్బాస్! ముందుకు రమ్ము. బఖ్రాహ్ అధ్యాయపు ఓ అనుచరులారా! అనగా బఖ్రాహ్ అధ్యాయమును కంఠస్థం చేసిన ఓ అనుచరులారా! హుదేబియా రోజున ఒక వృక్షం క్రింద బైఅత్ చేసిన ఓ అనుచరులారా! దేవుని ప్రవక్త మిమ్ములను పిలుస్తున్నాడు అని గట్టిగా పిలువుము అని అన్నారు.

ఒక అనుచరుడు ఇలా పేర్కొన్నాడు. మక్కాలో అప్పుడే ఇస్లాంను స్వీకరించిన కొంత మంది పిరికి నూతన ముసల్మానుల వలన ఇస్లామీయ సైన్యం యొక్క ముందు భాగం వెనుకకు పరుగెత్తగా వాటిని చూసి మా గుర్రాలు కూడ వెనుకకు పరుగెత్తాయి. మేము ఎంతగా అడ్డుకోవడానికి ప్రయత్నించినా కూడ అవి ఆగలేక పోయాయి. అప్పటికే అబ్బాస్ రజి పిలుపు బఖ్రాహ్ అధ్యాయపు ఓ అనుచరులారా! అనగా బఖ్రాహ్ అధ్యాయమును కంఠస్థం చేసిన ఓ అనుచరులారా! హుదేబియా రోజున ఒక వృక్షం క్రింద బైఅత్ చేసిన ఓ అనుచరులారా! దేవుని ప్రవక్త మిమ్ములను పిలుస్తున్నాడు అనే పిలుపు మారుమ్రోగింది. మరల ఇలా తెలిపారు. ఈ పిలుపు నా చెవిలో పడగానే నేను ప్రాణాలతో లేనట్లుగానే నాకు అనిపించింది. ఒక విధముగా నేను మరణించినట్లుగా మరియు ఇస్రాఫీల్ శంఖమును పూరిస్తున్నట్లుగా అనిపించినది. నేను నా ఒంటె ముక్కు త్రాడును బలంగా లాగాను. ఫలితముగా దాని తల నడుముకు తగిలింది. కాని అది ఎంతగా భయపడిందనగా నేను త్రాడును వదిలి వేయగానే మరల వెనుకకు పరుగెత్తసాగింది. అప్పుడు నేను మరియు చాలా మంది అనుచరులు మా ఖడ్గాలను మేము చేత పట్టుకొని ఒంటెలపై నుండి క్రిందికి దూకాము. మరి కొందరు ఒంటెల తలలను నరికివేశారు. ఆపై అందరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు పరుగెత్తారు. మక్కా వైపు పరుగులు తీస్తున్న 10వేల మందితో కూడిన సైన్యం కొంత సమయంలోనే ఏకమైంది. హుజూర్ స వద్దకు చేరుకున్నది. చూస్తుండగానే గుట్టలపై ఎక్కి శత్రువులను సంహరించారు. ఫలితముగా ఈ భయంకరమైన ఓటమి ఒక గొప్ప విజయరూపంను దాల్చింది.

(తఫ్సీరే కబీర్, సంపుటి 6, పుట 409-410)

తాయిఫ్ యుద్ధం. తాయిఫ్ మక్కా కు తూర్పు దిశలో సుమారు 90 కిలో మీటర్ల దూరంలో ఉన్నటు వంటి ప్రముఖ నగరం మరియు హిజాజ్ ప్రాంతపు పర్వత నగరం. ఇక్కడ ద్రాక్ష మరియు ఇతర ఫలాలు అధికముగా ఉంటాయి. ఈ ప్రాంతంలో బనూ సఖీఫ్ వారు నివాసం ఉంటున్నారు.

(ఫ్రాంగ్ సీరత్, పుట 178, జవాహిర్ అకాడమి కరాచి 2003)

తాయిఫ్ యుద్ధంను గూర్చి ఈ విధముగా గలదు. హవాజిన్ మరియు సఖీఫ్ తెగలకు చెందిన వారు ఓటమిని చవి చూసిన భయంతో తమ నాయకుడు మాలిక్ బిన్ ఔఫ్ నస్రీతో కలసి తాయిఫ్‌కు పారిపోయి వచ్చాడు. ఆపై ఇక్కడి కోటలో దాక్కున్నాడు. కావున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హునైన్ యుద్ధం ముగిసిన తరువాత జిఇ్రానా అనే ప్రాంతంలో యుద్ధ సంపదను ఏకం చేయించి పంచి పెట్టారు. ఆపై ఆ మాసంలోనే అనగా హిజ్రి 8వ సంవత్సరం

షవ్వాల్ మాసంలో తాయిఫ్ వైపు బయలు దేరాలని సంకల్పించుకున్నారు. (అగ్రహీఖుల్ మఖ్తూమ్, పుట 567, అల్ మక్తబ స్సల్ఫియ లాహౌర్)

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎన్ని రోజుల తాయిఫ్‌ను కట్టడి చేశారు అనే విషయాన్ని గూర్చి విభిన్న కథనాలు తెల్పుచున్నాయి. కొందరు సుమారు 10 కంటే ఎక్కువ రోజులు కట్టడి చేశారని, మరికొందరు హుజూర్ (స) 20 రోజులు కట్టడి చేశారని,, మరి కొందరు 20 రోజులకు పైబడియే కట్టడి చేశారని పేర్కొన్నారు. ఒక కథనములో మాత్రము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సుమారు 30 రోజుల వరకు కట్టడి చేశారని పేర్కొన్నారు. (సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 5, పుట 388 ఫీ ఘజ్వతు త్తాయిఫ్. దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 1993)

ఇబ్నే హిష్షామ్ ఇలా తెలిపారు. సుమారు 17 రోజులు కట్టడి చేశారని పేర్కొన్నాడు. (సీరతున్నబ వియ్యతు లి ఇబ్నే హిష్షామ్ పుట 792, జికర్ ఘజ్వతు త్తాయిఫ్, బఅద హునైన్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2001)

సహి ముస్లింలో హజ్రత్ అనస్ రజి ఇలా పేర్కొన్నారు. మేము 40 రోజుల వరకు కట్టడి చేశాము. (సహి ముస్లిం, కితాబు జ్జకాత్, బాబ్ అతాఅల్ ముఅల్లఫతు ఖులూబుహుం అలల్ ఇ స్లామీ హదీస్ సంఖ్య 2442)

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తాయిఫ్‌లోని సఖీఫ నగరాన్ని కట్టడి చేశారు. ఆ క్రమంలో హుజూర్ (స) హజ్రత్ అబూబకర్ రజితో ఇలా అన్నారు: ఓ అబూబకర్ ! నేను ఒక కలను చూశాను. వెన్నతో నిండి ఉన్నటు వంటి ఒక పాత్రను నా ముందుకు తీసుకరావడం జరిగింది. కాని ఒక కోడి ముక్కుతో ఆ పాత్రను పొడవగా అందులో ఉన్న వెన్న మొత్తం కారిపోయింది. అప్పుడు హజ్రత్ అబూబకర్ రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇలా అన్నారు. ఓ రసూలుల్లాహ్! ఈ రోజు మీరు వీరి నుండి దేనినైతే పొందాలని నిశ్చయించుకున్నారో బహుశ అది ఈ రోజు లభించకపోవచ్చును. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ బహుశా నేను కూడ అలాగే చూస్తున్నాను అని అన్నారు. ఆ తరువాత కొంత సమయానికే హజ్రత్ ఉమర్ రజి వచ్చి ఇలా అన్నారు. ఇక్కడి నుండి బయలుదేరమని నేను ప్రజలకు పిలుపునివ్వాలా? అని అడిగారు. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎందుకు ఇవ్వకూడదు అని అన్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్ రజి అక్కడి నుండి బయలు దేరాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఫలితముగా అందరు వెనుదిరిగారు. (సీరతున్నబవియ్యతు లి ఇబ్నే హిష్షామ్ పుట 793, జికర్ ఘజ్వాయే తాయిఫ్ బఅద హునైన్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2001)

తబూక్ యుద్ధం హిజ్రి 9వ సంవత్సరం రజబ్ మాసంలో జరిగింది. ఈ యుద్ధంను గూర్చి ఈ విధముగా గలదు. తబూక్ మదీనా నుండి సిరియా వైపుకు వెళ్ళే వ్యాపార బృంధాల మార్గంలో గలదు. ఈ నగరం సిరియా మరియు అల్ ఖురఅ అనే లోతట్టు ప్రాంతం మధ్యలో ఉన్నది. ఈ నగరానే అస్‌హాబుల్ అయికా అని కూడ పిలుస్తారు. ఈ ప్రాంతంలోనే హజ్రత్ షుహైబ్ అలైహిస్సలాం అవతరించారు.

(ముఅజముల్ బల్దాన్, సంపుటి 2, పుట 14, దారు సాదిర్ బెహ్రూత్ 1977)

హజ్రత్ అబూబకర్ రజి తబూక్ యుద్ధంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తోడుగా ఉన్నారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ యుద్ధంలో పెద్ద పతాకంను హజ్రత్ అబూబకర్ రజికు అప్పగించారు. (అత్తబ్ఖాతుల్ కుబ్రా సంపుటి 3, పుట 131, అబూబకర్ సిద్ధీఖ్ వ మిన్ బనీ తైమీమ్ బిన్ మర్రు బిన్ కఅబ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2017)

హజ్రత్ అబూబకర్ రజి తబూక్ యుద్ధ సందర్భములో తమ సంపదనంతయు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధిలో అప్పగించారు. వారి సంపద మొత్తం 4వేల దిర్హములు.

(షరఅ అల్లామా జర్కానిసంపుటి 4, పుట 69, సుమ్మ ఘజ్వతు తబూక్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్)

రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ యుద్ధం కోసం అనుచరులను సిద్ధం కావాలని ఆదేశించినప్పుడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా మరియు ఇతర అరబ్ తెగల వారు కూడ ఈ యుద్ధంలో పాల్గొనాలని వారికి సందేశాన్ని పంపించారు. ఈ క్రమంలో హుజూర్ (స) సంపన్నులను తమ ధనమును దైవ మార్గంలో ఖర్చుచేయమని, ప్రయాణానికి ఒంటెలను, గుర్రాలను సమకూర్చాలని కూడ కోరారు. అనగా హుజూర్ (స) ఈ యుద్ధం తమ చివరి యుద్ధం అని సంకేత పూర్వముగా బలంగా నొక్కి చెప్పారు. కావున ఈ క్రమంలో అందరి కంటే ముందుగా తమ ధనమును హజ్రత్ అబూబకర్ సిద్ధీఖ్ రజియల్లాహ్ తాలా అన్‌హు తీసుకవచ్చారు. వారు రజి తమ ఇంట్లో ఉన్న 4వేల దిర్హముల ధనమునంతయు తీసుకవచ్చారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మీ కుటుంబీకుల కోసం ఏమైన వదిలి వచ్చావా? అని హజ్రత్ అబూబకర్ రజి అడిగి తెలుసుకోగా, వారు రజి కుటుంబీకులకు అల్లాహ్ మరియు అతని ప్రవక్తను వదిలి వచ్చాను అని సమాధానం ఇచ్చారు.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజి తన ఇంట్లో ఉన్న సగం ధనమును తీసుకొని వచ్చారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కుటుంబీకుల కోసం ఏమైన వదిలి వచ్చావా? అని హజ్రత్ ఉమర్ రజిను అడిగి తెలుసుకోగా వారు రజి సగం ధనమును వదిలి వచ్చాను అని సమాధానం ఇచ్చారు. ఆ సమయంలో హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజి 100 ఊఖియాలను సమర్పించారు. ఇవి కూడ సుమారు 4వేల దిర్హములు అవుతాయి. ఆ తరువాత హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ మరియు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌లు ఈ భూమండలంపై అల్లాహ్ తాలా యొక్క ఖజానాలలో ఖజాన వంటి వారు. వారు అల్లాహ్ ప్రీతి కొరకు ఖర్చు చేస్తుంటారు. వారు చాలా ధనమును ఖర్చు చేశారు. ఈ యుద్ధం కొరకు మహిళలు కూడ తమ ఆభరణాలను సమర్పించారు. అదే విధముగా హజ్రత్ ఆసిం బిన్ అద్ది రజి 70 వస్‌ఖ్‌ల ఖర్జూర ఫలములను సమర్పించారు. అవి సుమారు 262 మన్‌లకు సమానం. (సీరతుల్ హల్బియా సంపుటి 3, పుట 183-184, ఘజ్వా తబూక్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2002)(లుఘతుల్ హదీస్ సంపుటి 1, పుట 82, ఔఖియా)( లుఘతుల్ హదీస్ సంపుటి 4, పుట 487 వస్‌ఖ్ సంపుటి 2, పుట 648 సాఅ)

ఒక మన్ అనగా 40 కిలోలు. ఈ లెక్కన చూసుకున్నచో 1500 కిలోలో అనగా ఒక టన్నుకు పైబడి ఉంటుంది. సుమారు టన్నున్నర అవుతుంది.

జైద్ బిన్ అస్లం తన తండ్రిని ఆధారం చేసుకొని ఈ విధముగా తెలిపారు: ఉమర్ బిన్ ఖత్తాబ్ రజి అనుకుంటు ఉండగా నేను ఈ విధముగా విన్నాను. దాన ధర్మాలు చేయమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వస్లం మమ్ములను ప్రోత్సహించారు. ఆ సమయంలో నా వద్ద ధనము కూడ ఉన్నది. ఈ రోజు నేను అబూబకర్ రజికంటే ఎక్కువగా సమర్పించుకుంటాను, ఒకవేళ నేను వారికంటే ఎక్కువ సమర్పించుకోవలసి ఉన్నచో అది ఈ రోజే అని అనుకున్నాను. వారు ఇలా తెలిపారు. మరల హజ్రత్ ఉమర్ రజి మాకు ఇలా చెప్పారు. నేను నా వద్ద ఉన్నటు వంట ధనములో సగం ధనమును తీసుకవచ్చాను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నాతో నీవు మీ కుటుంబీకుల కోసం ఎంత ధనమును వదిలి వచ్చావు? అని అడిగారు. అందుకు నేను సగం ధనమును అని సమాధానం ఇచ్చాను. ఆ తరువాత హజ్రత్ అబూబకర్ రజి వచ్చారు. మరల హజ్రత్ ఉమర్ రజి ఇలా తెలిపారు. వారు తమ వద్ద ఉన్నదంతయు తీసుకొని వచ్చారు. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారితో మీ కుటుంబీకుల కోసం ఏమి వదిలి వచ్చావు? అని అడిగారు. అందుకు వారు రజి నేను నా కుటుంబీకుల కోసం అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను వదిలి వచ్చాను అని సమాధానం ఇచ్చారు.

హజ్రత్ ఉమర్ రజి మరల ఇలా తెలిపారు. అప్పుడు నేను ఇలా భావించుకున్నాను. అల్లాహ్ ప్రమాణం! నేను ఏ విషయంలో కూడ ఎప్పుడు వారిని అధిగమించలేను అని అర్థం చేసుకున్నాను.

(సునన్ తిర్మిజి కితాబుల్ మనాకిబ్, బాబ్ రజాఅ లన్ యకూన అబూబకర్ మిమన్ యద్ఈ మన్ జమీఉ అబువాబల్ జన్నతి హదీస్ సంఖ్య 3675)

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: ఒకానొక కాలంలో ప్రజలు దైవ ధర్మ స్థాపన కోసం తమ ప్రాణాలను మేకలు, గొర్రెల వలే అర్పించుకునేవారు. ధనమును గూర్చి ఏమి ప్రస్తావించాలి. హజ్రత్ అబూబకర్ రజి యల్లాహ్ తాలా అన్‌హు ఒకటి కంటే ఎక్కువ సార్లు తన ఇంట్లో ఉన్న మొత్తంను సమర్పించుకున్నారు. చివరికి సూదిని కూడ తన ఇంట్లో వదల లేదు. అదే విధముగా

హ్రజత్ ఉమర్ రజి కూడ తమ శక్తి సామర్థ్యంల మేరకు మరియు హ్రజత్ ఉస్మాన్ రజి కూడ తమ శక్తి సామర్థ్యం, సంపాదన మేరకు, అదే విధముగా అనుచరులు కూడ వారికి తోచినంతగా, వారి స్థాయి మేరకు తమ జంతువులను, ధనమును, సామాగ్రిని దైవ ధర్మ స్థాపన కోసం సమర్పించుకున్నారు. మరల హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన వారిని ఉద్దేశిస్తూ ఈ విధముగా తెలిపారు: కాని కొందరు మాత్రం బైఅత్ చేస్తారు, ఆపై మేము ధర్మమునకు ప్రాపంచికతపై ప్రాధాన్యతను ఇస్తాము అని వాగ్దానం చేస్తారు, కాని సహాయంను అందించమని పిలుపునిచ్చినప్పుడు తమ జేబులను గట్టిగా పట్టుకొని కూర్చుంటారు. భలా! ఇంతటి ప్రాపంచిక ప్రేమను కల్గియున్నవారు ఎవరైన ధార్మిక లక్ష్యయాలను సాధించగలరా?. ఇలాంటి వారు ఏ విధమైన ప్రయోజనాన్ని చేకూర్చగలరా?. ఎన్నడు చేకూర్చలేరు. ఎన్నడు చేకూర్చలేరు. మరల వారు ఇలా తెలిపారు. అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. తన్ తనాలూల్ బిర్ర హత్తా తున్ఫిఖూ మిమ్మా తుహిబ్బూన్ అనగా మీకు ప్రియమైన ధనమును మీరు దైవ మార్గంలో ఖర్చు చేయనంత వరకు మీరు చేయు ఏ సత్కార్యము కూడ పుణ్యఫలము కాజాలదు.

(మల్ఫూజాత్ సంపుటి 6, పుట 40 అనుబంధం)

హ్రజత్ అబూబకర్ రజి ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలసి ఒక అనుచరుడిని సమాధి చేయు ఆంశంను గూర్చి హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మసూవూద్ రజి ఇలా ఉల్లేఖించారు. తబూక్ యుద్ధంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు నేను కూడ ఉన్నాను. ఒకసారి నేను అర్థరాత్రి వేళ లేచి చూడగా సైన్యానికి ఒక వైపు మండుచున్న మంటను చూశాను. కావున అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి నేను అక్కడికి వెళ్ళి చూడగా, అక్కడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హ్రజత్ అబూబకర్ రజి, హ్రజత్ ఉమర్ రజిలు కూడ ఉన్నారు. అక్కడ నేను చూసిన దృశ్యమేమనగా, హ్రజత్ అబ్దుల్లాహ్ జుల్ బిజాదైన్ ముజనియ్యు రజి మృతి చెందారు. వీరు వారి కొరకు సమాధిని త్రవ్వినారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాధిలో నిలబడి ఉన్నారు. హ్రజత్ అబూబకర్ రజి, హ్రజత్ ఉమర్ రజిలు వారి మృతదేహాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా సమాధిలోకి దించుచున్నారు. ఆ సమయంలో హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. మీరు ఇరువురు మీ సోదరుడిని నా సమీపంనకు తీసుకరండి. అందుకు వారు ఇరువురు హ్రజత్ అబ్దుల్లాహ్ జుల్ బిజాదైన్ మృతదేహాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమీపంనకు తీసుక వచ్చారు. హుజూర్ (స) వారిని సమాధిలో దించిన తరువాత ఈ దుఆను పఠించారు. అల్లాహుమ్మ ఇన్ని అమ్సైయితు రాజియ్యన్ అన్హు ఫాఅర్జా అన్హు అనగా ఓ అల్లాహ్! నేను ఇతని పట్ల ప్రీతిని పొందిన స్థితిలో సాయంత్రానికి చేరుకున్నాను. కావున నీవు కూడ ఇతని పట్ల ప్రీతిని చెందుము.

హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మసూవూద్ రజి ఇలా ఉల్లేఖించారు. ఆ సమయంలో నేను ఈ మృతుని స్థానంలో నేను ఉన్నచో, ఈ సమాధి నాదే అయినచో ఎంత బాగుండునో అని భావించుకున్నాను.

(సీరత్ ఇబ్నే హష్షామ్, పుట 822, కితాబు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అస్సాహిబు ఈలతు, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్ 2001)

హ్రజత్ అబ్దుల్లాహ్ జుల్ బిజాదైన్ రజి బనూ ముజైయినా తెగకు చెందినవారు. వారిని గూర్చి ఈ విధముగా పేర్కొనబడింది. వారు బాల్యంలో ఉండగానే వారి తండ్రి మృతి చెందాడు. వారికి వారి తండ్రి వారసత్వం నుండి ఏమియు లభించలేదు. వారి పిన్నాన్న చాలా ధనవంతుడు. ఆ పిన్నానయే వారిని పెంచి పోషించాడు. ఈ క్రమంలో వారు రజి కూడ ధనవంతులైనారు. వీరు రజి మక్కా విజయం తరువాత ఇస్లాంను స్వీకరించారు. ఫలితముగా వారి పిన్నాన్న వారి నుండి వారి సంపదనంతయును లాక్కున్నారు. చివరికి వారు కట్టుకున్న లుంగీని కూడ తీసుకున్నారు. ఆ తరువాత వారి రజి తల్లి వచ్చింది. వారు తమ దుప్పటిని రెండు ముక్కలుగా చేసి ఒక ముక్కను హ్రజత్ అబ్దుల్లాహ్ రజికు లుంగీవలే కట్టుకోవడానికి వచ్చింది. రెండవ ముక్కను వారు తమ తలపై వేసుకున్నారు. ఆ తరువాత వారు రజి మదీనాకు వచ్చారు. మస్జిద్‌లోనే పడుకున్నారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు ఫజర్ నమాజ్ చదివారు. మరల వీరు ఇలా తెలిపారు. ఫజర్ నమాజ్ తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలను చాలా శ్రద్ధగా పాతవారు ఎవరు? క్రొత్త వారు ఎవరు? అని గమణించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అబ్దుల్లాహ్ రజిను చూసి క్రొత్త వ్యక్తిగా గూర్తించారు. ఆపై హ్రజత్ అబ్దుల్లాహ్ రజిను ఎవరు నీవు? అని అడిగి తెలుసుకున్నారు. హ్రజత్ అబ్దుల్లాహ్ తన వివరాలన్ని తెలిపారు. మరొక కథనములో ఈ విధముగా గలదు. వారు రజి తన పేరు అబ్దుల్ ఉజ్జా అని తెలిపారు. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నీవు అబ్దుల్లాహ్ జుల్ బిజాదైన్ అనగా రెండు దుప్పట్లు గలవాడవు అని అన్నారు. ఆ తరువాత నీవు నా వెంటనే ఉండుము అని అనుమతినిచ్చారు. ఫలితముగా వీరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతిథులలో ఒకరైనారు. హుజూర్ (స) వారికి ఖుర్‌ఆన్‌ను నేర్పించేవారు. అలా వారు రజి ఖుర్‌ఆన్ మజీద్‌లోని అనేక అధ్యాయములను కంఠస్థం చేశారు. పైగా వారు రజి చాలా గట్టిగా మాట్లాడేవారు. (సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 5, పుట 459–460, ఫి ఘజ్వతు తబూక్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 1993) ( ఉసదుల్ ఘాబా సంపుటి 3, పుట 229, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ )

హ్రజత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహ్ తాలా అన్హు హజ్ చేయుచున్న సమయంలో అమీర్‌గా కొనసాగిన ఆంశంను గూర్చిన ప్రస్తావన ఈ విధముగా గలదు. ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం హిజ్రి 9వ సంవత్సరంలో హ్రజత్ అబూబకర్ సిద్దీఖ్ రజిను హజ్‌యాత్రకు అమీర్‌గా నియమించి మక్కాకు సాగనంపారు. ఈ వివరణ ఈ విధముగా గలదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ నుండి తిరిగి వచ్చిన తరువాత హుజూర్ (స) హజ్ యాత్ర చేయాలని సంకల్పించుకున్నారు. కాని హుజూర్ (స)తో హజ్‌కు విగ్రహారాధకులు, అన్యారాధులు కూడ వస్తారని, ఆ విగ్రహారాధకులు విగ్రహారాధనకు చెందిన పంక్తులు పలుకుతారు, ఆపై ఖానా కాబా చుట్టూ నగ్నంగా ప్రదక్షణలు చేస్తారు అని తెలుపగా, ఆయా విషయాలను విన్న తరువాత ఆ సంవత్సరం హుజూర్ (స) హజ్ యాత్ర సంకల్పంను విరమించు కున్నారు. కావున హ్రజత్ అబూబకర్ రజిను హజ్ యాత్రీకులకు అమీర్‌గా నియమిస్తూ మక్కాకు పంపారు. (అర్రోజుల్ అనఫ్ ఫి తఫ్సీరుల్ సీరతున్నబవియ్యతు లి ఇబ్నే హష్షామ్, హజ్ అబూబకర్ బిన్నాసి సనతు తిస్ఆ సంపుటి 4, పుట 318–319, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్) (ఉమ్దతుల్ ఖారి, కితాబుల్ హజ్, బాబ్ లా యతూఫు బిల్ బైఅతి ఉర్యాన్, సంపుటి 9, పుట 384, ప్రచురణ దారుల్ అహ్యా అత్తరాసుల్ అరబి 2003).

హ్రజత్ అబూబకర్ సిద్దీఖ్ రజి 300ల అనుచరులతో కలసి మదీనా నుండి బయలు దేరినారు. ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారితో పాటు 20 ఖుర్బాని జంతువులను కూడ పంపారు. వాటి మెడలో ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయముగా తమ స్వహస్తాల ద్వారా పట్టిలు తొడిగి, అవి ఖుర్బాని జంతువులని గుర్తించడం కోసం గుర్తులు కూడపెట్టారు. హ్రజత్ అబూబకర్ రజికూడ స్వయముగా 5 ఖుర్బాని జంతువులను తీసుకవెళ్ళారు. (సీరతుల్ హల్బియతు, సంపుటి 3, పుట 295, బాబ్ సరాయ వ బఊస సల్లల్లాహు అలైహి వసల్లం సరియ ఉసామ బిన్ జైద్ .. దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్)

హ్రజత్ అలీ రజి తౌబహ్ అధ్యాయపు ప్రారంభపు సూక్తులను హజ్ సమయంలో చదివి వినిపించిన కథనము కూడ గలదు. ఆ కథనము ఈ విధముగా గలదు. అబూ జఅఫర్ ముహమ్మద్ బిన్ అలీ ఇలా ఉల్లేఖించారు. బరాఅ (తౌబఅ) అధ్యాయం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించిన సమయానికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హ్రజత్ అబూబకర్ రజిను హాజీలకు అమీర్‌గా నియమిస్తూ సాగనంపారు. కావున అనుచరులు హుజూర్ (స)తో ఓ రసూలుల్లాహ్ (స)! ఒకవేళ మీరు ఈ అధ్యాయమును హ్రజత్ అబూబకర్ రజి కు చేరవేసినచో వారు ఈ సూక్తులను అక్కడ చదివి వినిపిస్తారు అని విన్నవించుకున్నారు. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ బాధ్యతను నా కుటుంబీకులు కాకుండా మరెవ్వరు కూడ నా వైపు నుండి సరిగా నెరవేర్చలేరు అని వారికి నచ్చజెప్పారు. ఆ తరువాత హుజూర్ (స) హ్రజత్ అలీ రజిను పిలిపించారు. ఆపై వారితో అవతరించబడిన తౌబహ్ అధ్యాయపు ప్రారంభపు సూక్తులను తీసుకొని వెళ్ళుము, ఖుర్బాని రోజున ప్రజలు మనాలో ఏకమయినప్పుడు అక్కడ ప్రకటించుము. స్వర్గంలోకి ఏ అన్యారాధుడు ప్రవేశించలేడు. ఈ సంవత్సరం తరువాత ఏ అన్యారాధుడికి హజ్ చేయుటకు

అనుమతి ఉండదు. బైతుల్లాహ్ చుట్టూ నగ్నంగా ప్రదక్షణలు చేయుటకు ఎవరిని అనుమతి ంచబడదు. ఎవరికైన ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మాట ఇచ్చినచో ఆ మాటను నెరవేర్చుటకు అవకాశం కల్పించబడును.

హజ్రత్ అలీబిన్ అబూ తాలిబ్ రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అజ్బా అనే ఒంటెపై ప్రయాణం ప్రారంభించారు. వారు మార్గ మధ్యలోనే హజ్రత్ అబూబకర్ రజిను కలిసారు. హజ్రత్ అబూబకర్ రజి ను హజ్రత్ అలీ రజి అర్జ్ యా జబ్నాన్ అనే లోతట్టు ప్రాంతంలో కలిసారు. అర్జ్ మదీనా మరియు మక్కా మధ్యలో ఉన్నటు వంటి ఒక పర్వత ప్రాంతం. ప్రయాణికులు ఇక్కడే బస చేస్తుంటారు. మరియు జబ్నాన్ మదీనా మార్గంలో మక్కా నుండి 25 మైళ్ళ దూరంలో ఉన్నటు వంటి సమీప ప్రాంతం. మొత్తానికి హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ అలీ రజిను రావడంను చూసి వెంటనే వారితో మిమ్ములను అమీర్గా నియమించారా? లేక మీరు నా అమారత్ను అనుసరిస్తారా? అని అడిగారు. ఇది వారి విధేయతకు దర్పణం. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పంపినచో మీరు అమీర్గా కొనసాగుతారా? లేదా నన్ను అనుసరిస్తారా?. హజ్రత్ అలీ రజిను అందుకు నేను మిమ్ములనే అనుసరిస్తాను అని సమాధానం ఇచ్చారు. అలా వారు ఇరువురు కలిసి ప్రయాణం కొనసాగించారు. హజ్రత్ అబూబకర్ రజి ప్రజల హజ్ ఆంశాలను పర్యవేక్షించసాగారు. ఈ సంవత్సరం అరబ్ ప్రజలు మూర్ఖత్వపు కాలంలో ఏ ప్రాంతంలోనైతే బస చేసేవారో ఆ ప్రాంతంలోనే బస చేశారు.

ఖుర్బాని రోజు రాగానే హజ్రత్ అలీ రజి నిలబడ్డారు. ప్రజల మధ్యలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాల మేరకు ప్రకటన చేశారు. ఈ క్రమంలోనే ఇలా అన్నారు. ఓ ప్రజలారా! అన్యారాధులెవ్వరు స్వర్గంలో ప్రవేశించలేరు. ఈ సంవత్సరం తరువాత ఏ అన్యారాధుడికి హజ్ చేయుటకు అనుమతి లభించదు. బైతుల్లాహ్ చుట్టూ నగ్నంగా ప్రదర్శించుటకు ఎవరికి కూడ అనుమతించబడదు. ఎవరికైన ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏదైనా వాగ్దానం చేసినచో ఆ వాగ్దానం మేరకు అవకాశంను కల్పించబడును. ఈ ప్రకటన తరువాత నుండి 4 నెలల వరకు వ్యవది ఇవ్వబడుతుంది. ఈ మధ్య కాలంలో ప్రతి జాతి వారు శాంతియుతముగా తమ తమ ప్రాంతాలకు చేరుకోవలెను. ఏ అన్యారాధుడితో ఇకపై ఎలాంటి ఒప్పందం జరుగదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కల్పించిన మినహాయింపు మేరకు ఎవరితోనైన ఒప్పందాలు ఉన్నచో వాటిని పూర్తి చేయబడును. ఆ ఒప్పందాలు కాకుండా మరెలాంటి ఒప్పందాలు చేసుకోబడవు. ఈ ప్రకటన ఆ సంవత్సరం తరువాత ఏ అన్యారాధుడు కూడ హజ్ చేయుటకు రాలేదు, ఎవరు కూడ నగ్నంగా ప్రదక్షణలు చేయలేదు.

మరొక కథనములో ఈ విధముగా గలదు. హజ్రత్ అలీ రజి ఉల్లేఖించారు. హజ్రత్ అబూబకర్ రజి అర్ఫా ప్రాంతానికి వచ్చి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వారు రజి ప్రసంగాన్ని ముగించిన తరువాత నా వైపు చూస్తూ ఓ అలీ ! లేచి నిలబడుము. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సందేశాన్ని వినిపించుము అని అన్నారు. కావున నేను నిలబడి వారి ముందు బరాఅ అధ్యాయపు మొదటి 40 సూక్తులను చదివి వినిపించాను. ఆ తరువాత వారు ఇరువురు హజ్రత్ అలీ రజి మరియు హజ్రత్ అబూబకర్ రజిలు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్నారు.

(సీరత్ ఇబ్నే హష్షామ్ హజ్ అబూబకర్ బిన్నాసి సనతు తిస్అ... పుట 832, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్ 2001) (సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 12, పుట 73, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 1993) ( అల్ బదాయతువన్నిహాయతు లి ఇబ్నే కసీర్ సంపుటి 7, పుట 228-229 జికర్ బఅస రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అబా బకర్ అమీర్ అలల్ హజ్... దారుల్ హిజర్ 1997)( ముఅజముల్ బల్దాన్ సంపుటి 3, పుట 515, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్)( ఫ్రాంగ్ సీరత్ పుట 198, జవాహిర్ అకాడమి కరాచి 2003)

ఇక ముందుకూడ ఈ ప్రస్తావన కొనసాగుతుంది. ఇప్పుడు నేను కొందరు మృతులను గూర్చి మీ ముందు ప్రస్తావించెదను. కొన్ని రోజుల క్రితం వీరు మృతి చెందారు. వీరి జనాజ కూడ ఇన్షా అల్లాహ్ చదివించెదను.

గౌ॥అమతుల్ లతీఫ్ ఖుర్షీద్ గారిది. వీరు కెనడాలో ఉంటున్నారు. షేక్ ఖుర్షీద్ అహ్మద్ అసిస్టెంట్ ఎడిటర్ అల్ ఫజల్ రబ్వా గారి శ్రీమతి. 95 సంవత్సరాల వయస్సులో వీరు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వీరు వసియ్యత్ చేశారు. వీరు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి అనుచరులైన హజ్రత్ మియాం ఫజల్ ముహమ్మద్ గారి హర్సియాం వారి మనుమరాలు. హజ్రత్ హకీం అల్లాహ్ భక్ష్ గారు మద్రాస్ దర్బాన్ ఢేవిడి హజ్రత్ అమ్మాజాన్ గారి కుమార్తే కూతురు. గౌ॥ మియాం అబ్దుర్రహీం దయానత్ గారు దర్వేష్ ఖాదియాన్ మరియు ఆమిన భేగం గార్ల పెద్ద కూతురు. నుస్రత్ గర్ల్స్ హైస్కూల్ ఖాదియాన్ నుండి వీరు 10వ తరగతి ఉత్తీర్ణులైనారు. ఆ తరువాత జామిఅ నుస్రత్ లో 43 లేదా 44వ సంవత్సరంలో ప్రవేశం పొందారు. రెండు సంవత్సరాల పాటు జామిఅ నుస్రత్లో విధ్యనభ్యసించారు. ఆ తరువాత ప్రైవేట్ లో విద్యనభ్యసించి అదీబ్ ఆలిం పరీక్షలో ఉత్తీర్ణతను సాధించారు. వీరి వివాహం షేక్ ఖుర్షీద్ అహ్మద్ గారు అసిస్టెంట్ ఎడిటర్ అల్ ఫజల్గారితో జరిగింది. నేను ముందుగా తెల్పినట్లుగా వీరి వివాహం హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సానీ రజి మస్జిద్ ముబారక్లో చదివించారు. అల్లాహ్ తాలా వీరికి ముగ్గురు కుమారులను, ఇద్దరు కుమార్తేలను అనుగ్రహించాడు. అబ్దుల్ బాసిత్ షాహిద్ మురబ్బి సిల్సిలా గారి సోదరి. నేడు వారు ఇక్కడే ఉన్నారు. లండన్లో కూడ వారు సేవలందించేవారు. బాసిత్ షాహిద్ గారు చాలా కాలం ఆఫ్రీకాలో సేవలందించారు.వారి ఒక మనుమడు వఖాస్ అహ్మద్ ఖుర్షీద్ గారు కూడ అమెరికాలో మురబ్బి సిల్సిలాగా సేవలందిస్తున్నారు. వీరిది విజ్ఞాన వంతమైన వంశం. వీరి ఒక సోదరి అమతుల్ బారి నాసిర్ గారు కూడ విజ్ఞాన పరమైన సేవలనందిస్తున్నారు.

అమతుల్ లతీఫ్ గారు 13 సంవత్సరాల వయస్సులో లజ్నా ఇమాఉ ల్లాహ్ కు చెందిన అనేక పదవులలో సేవలందించడం ప్రారంభించారు. వీరు సుమారు 70 సంవత్సరాల వరకు సేవలందిస్తునే వచ్చారు. వీరికి హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి గారి మార్గదర్శకాలు, హజ్రత్ ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ సయ్యిదా నుస్రత్ జహాం భేగం రజిగారి పర్యవేక్షణలో అదే విధముగా అనేక మంది మహోన్నతుల పర్యవేక్షణలో సేవలందించు భాగ్యము లభించినది. ఖాదియాన్లో కూడ వీరికి సేవలందించు భాగ్యము లభించినది. ఆ తరువాత దేశ విభజన తరువాత హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి మరియు హజ్రత్ చోటి ఆపా గార్ల ఆదేశాల మేరకు ముహాజిరాత్లకు ఇంచార్జ్గా సేవలందించు భాగ్యము లభించినది. అదే విధముగా అనేక స్థాయిలలో లజ్నాఉపశాఖలో కూడ సేవలందించారు. చాలా కాలం పాటు వీరు సెక్రటరి ఇషాఅత్గా సేవలందించు భాగ్యమును పొందారు. మిస్బా సంచికకు 1979 నుండి 1986 వరకు సంపాదకీయురాలిగా సేవలందించారు. 1986లో వీరు కెనడాకు వలస వెళ్ళారు. అక్కడ కూడ లజ్నా శాఖలో గౌరవనీయమైన సలహాదారురాలిగా సేవలందించారు. తస్నీఫ్ మరియు ఇషాఅత్లో లజ్నా ఇమాఅల్లాహ్ యొక్క ప్రారంభ 4 సంపుటిలు అల్ మసాబిఇ మరియు అల్ అజ్హార్ కూర్పు చేయుటలో కూడ ఎనలేని సేవలందించారు. హజ్రత్ చోటి ఆపా తో పాటు 44 సంవత్సరాల పాటు సేవలందించు భాగ్యమును పొందారు. వారి పర్యవేక్షణలో నాసిరాతుల్ అహ్మదియ్యా యొక్క మొట్టమొదటి సమావేశం నిర్వహించడం జరిగింది. అమతుల్ లతీఫ్ గారు సెక్రటరీ నాసిరాతుల్ అహ్మదియ్యగా బాధ్యతలు చేపట్టినప్పుడు వారి భర్త ఖుర్షీద్ అహ్మద్ గారి సహకారంతో రాహే ఈమాన్ మరియు జమాఅత్ అహ్మదియ్యా యొక్క సంక్షిప్త చరిత్ర అనే పుస్తకాలకు రూపకల్పన చేశారు.

వారి కుమారుడు లయీఖ్ అహ్మద్ ఖుర్షీద్ గారు ఇలా తెలిపారు. క్రీ॥శే॥ తల్లి గారు మా ఇంట్లో పిల్లలందరికి నేర్పించిన పాఠం ఏమిటనగా ఒకవేళ జమాఅత్కు వ్యతిరేకముగా, ఖిలాఫత్కు వ్యతిరేకముగా ఏ మాటను కూడ ఎప్పుడు వినకూడదు. ఒకవేళ చెవిలో పడిన కూడిన దానిని మరల ఉచ్చరించకూడదు. నోటి ద్వారా పలుకకూడదు. ఎందుకనగా అల్లాహ్ తాలా ప్రత్యేక సహాయ సహకారములు జమాఅత్ మరియు ఖిలాఫత్కు తోడుగా ఉన్నాయి.మరల వారు ఇలా తెలిపారు. ప్రతి క్లిష్ట సమయంలో మరియు విపత్తు కాలం తరువాత అల్లాహ్ తాలా సంకేతాలు జమాఅత్ పక్షంలో బహిర్గతమవుతాయి. అందుకే మీరు అనవసరముగా అశాంతియుత కార్యకలాపాలలో పాల్గొనరాదు. మరల ఇలా వ్రాసారు: వీరు జమాఅత్ యొక్క కదులుతున్నటు వంటి చరిత్ర నిదర్శనం. చాలా కలివిడిగా ఉ ండేవారు. అందరి మంచిని కోరేవారు. దైవం పట్ల నమ్మకం, మానవ సేవ పట్ల

చాలా ఆసక్తి కల్గినవారు. చాలా ముహాజిర్ కుటుంబీకులకు కేనడాలో జీవించుటకు తగిన ఏర్పాట్లు చేసేవారు.

మరల వారి మరో కుమారుడు ఇలా వ్రాసారు: మా తల్లి గారికి ఖిలాఫత్ పట్ల చాలా ప్రేమాభిమానాలు ఉన్నాయి. అనుక్షణం మాకు ఖలీఫా కొరకు దుఆలు చేయండి అని గుర్తు చేసేవారు. నమాజ్‌లను సమయపాలనతో చదివేవారు. జుమా రోజు మాకు పండుగ రోజుల అనిపించేది. ఖుర్ఆన్ మజీద్ పట్ల చాలా అభిమానం ఉండేది. మరల ఇలా తెలిపారు. చాలా మంది పిల్లలకు ఖుర్ఆన్ మజీద్‌ను నేర్పించారు. సరైన ఉచ్చరణతో నేర్పించేవారు. చదువమని ప్రోత్సహించేవారు.

వారి మనుమనుడు వఖాస్ ఖుర్షీద్ గారు మురబ్బి సిల్‌సిలాగా సేవలందిస్తున్నారు. వారు ఇలా తెలిపారు. ఎల్లప్పుడు దుఆ మరియు విద్యనభ్యసించడం వైపు శ్రద్ధ చూపేవారు. జమాఅత్ చరిత్రను దృష్టిలో పెట్టుకొని కథలను వినిపించేవారు. కథల ద్వారా జమాఅత్ చరిత్రను నేర్పించేవారు. తద్వారా వారిని ఉత్తములుగా తీర్చి దిద్దాలని చూసేవారు.

వారి మనుమరాలు ఒకరు ఇలా వ్రాసారు: మా దాదికి 9 మంది మనుమరాళ్ళు. వారు కేవలం మేము లజ్నా ఇమాఅల్లాహ్ సేవకురాళ్ళము కావాలనే ఉద్దేశంతో మాకు శిక్షణతో పాటు సభ్యత సంస్కరాలను పరాదను సరైన విధముగా ఏ విధముగా ధరించాలి అని కూడ నేర్పించారు. కుటుంబ బాధ్యతలు, ఆతిథ్య మర్యాధలు, కుట్టు మిషన్ పనులు, ఉర్దూలో వ్రాయడం చదవడం వంటి వాటిలో మా కొరకు ఒక శాశ్వత మార్గదర్శకురాలిగా ఉండేది. మా వయస్సు పెరుగుచున్న కొద్ది మాకు మా భర్తలతో, అత్తమామలతో మంచిగా నడుచుకునే విధానాలను కూడ నేర్పించారు. మేము మా అత్తమామలతో పాటు కలిసి ఉంటూ వారిని మంచిగా చూసుకుంటున్నాము అని చెప్పినచో చాలా సంతోషించేవారు. ఆ బాధ్యతలతో పాటు వారు మాకు ఉన్నతమైన విద్యను అభ్యసించడం మరియు కేరియర్‌ను ఏర్పాటు చేసుకోవడంలో సూచనలు సలహాలు ఇచ్చేవారు. పుట్టినరోజు వేడుకలు ఇస్లామేతర వేడుకలని, వాటిని చేసుకోకూడదని గట్టిగానొక్కి చెప్పేవారు. కాని వారు ప్రత్యేక సందర్భములను, జన్మదిన వేడుకలను గుర్తుంచుకునేవారు. ఎందుకనగా వారు ఎల్లప్పుడు మా అందరిని ఒక కుటుంబంలా కలిసి హందోసనా పద్యంను చదవమని, సామూహికముగా కలసి దుఆలు చేయాలని సూచించేవారు. మరల వారు ఇలా తెలిపారు. కెనడాలో వీరు అహ్మదియ్య ముసల్మానుల స్థాయిలో మమ్ములను పెంచి పోషించారు. వారు మాకు మన విశ్వాసాన్ని మరియు పాశ్చాత్య సాంసృతిని ఏ విధముగా మాధ్యమంతో కొనసాగించాలి అనే విషయాలను కూడ నేర్పించారు.

ఇది తల్లులు మరియు కుటుంబ పెద్దల బాధ్యత. నూతన పిల్లలను పెంచవలసిన విధానం.

నూతన తరాల వారికి ఏ విధముగా శిక్షణ ఇవ్వాలి, వారికి ఏ విధముగా ధర్మమును నేర్పించాలి. ఈ సమాజంలో ఉంటూ ఎలాంటి మనోభావాలకు గురి కాకుండా తమను తాము ఏ విధముగా ఇనుమడించుకోవాలి అనే అంశాలను నేర్పించాలి.

అల్లాహ్ తాలా వారిని మన్నించుగాకా! వారిని కరుణించుగాకా! వారి స్థాయిని పెంచుగాకా! వారి వారసులకు వారి సత్కార్యములను కొనసాగించు భాగ్యమును కల్పించు గాకా!.

సమాప్తం.

**, అల్లాహుమ్మ ఇన్నా నజ్అలుకా ఫి నుహూరిహిం వ నవూజు బిక మిన్ షురూరిహం.**

అనువాదము: ఓ మా ప్రభువా! మేము నిన్ను శతుబువుల ఎదుట డాలుగా చేసెదము, మరియు వారి దౌష్ట్య, హానికర ప్రభావాల నుండి నీ శరణమును కోరెదము

| | |
|---|---|
| **అహ్‌దీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)***

(గత సంచిక తరువాత)

ఒక వృద్దురాలు చలి కాలపు ఒక రాత్రి వేళలో స్టేషన్‌లో కూర్చొని యున్నది. ఏవరో ఒకరు ఆ వృద్దురాలి దుప్పటిని లాక్కొనిరి. ఆమేకు చలి వేయగా దుప్పటి కప్పుకొనుటకు ప్రయత్నించగా తన దుప్పటి ఎవరో తీసుకెళ్ళినట్లు గమనించినది. వెంటనే ఆ వృద్దురాలు ఓ హాజి సోదరులారా! నాకు ఉన్నది ఒకటే దుప్పటి. దాని అవసరం నాకు గలదు. కావున నాకు తిరిగి ఇచ్చివేయుము అని ఆరవడం ప్రారంభించినది. ఆ దుప్పటిని దొంగిలించిన వ్యక్తి ఎక్కడికి వెళ్ళకుండ సమీపంలోనే కూర్చొని యున్నాడు. ఆ అరుపులకు అతడు సిగ్గుతో తలదించుకొని ఆ దుప్పటిని ఆ వృద్దురాలికి ఇస్తు నీ దుప్పటిని దొంగిలించినది హాజియే నని ఎలా తెలుసుకున్నావని ప్రశ్నించెను. అందుకు ఆ వృద్దురాలు ఈ కాలంలో ఇంత కఠినంగా హాజీలు కాకుండ మరేవ్వరు వ్యవహరిస్తారని సమాధానం ఇచ్చెను.

కావున మనము సత్కార్యములను కొనసాగించుచున్నామని, మనము సదుద్ధేశమును కలిగియున్నామని భావించకుము. వ్యక్తి ఎంత పుణ్యమైన పని చేసినను అందులో దుష్కార్యము ఏర్పడవచ్చును. వ్యక్తి ఎంత మంచి ఉద్ధేశము కలిగియున్నను అతని విశ్వాసము చెడిపోయే అవకాశమున్నది. ఎందుకనగా విశ్వాసము మన కర్మల ఫలితముగా రాదు. అల్లాహ్ తఆలా కరుణతో వచ్చును. (ఇదొక ప్రాథమిక విషయము. దీనిని గుర్తుంచుకొనుము.) మన కర్మలు ఎన్ని ఉన్నను అల్లాహ్ తఆలా కరుణ లేనిచో, అతని అనుగ్రహము లేనిచో విశ్వాసము సంపూర్ణము కాదు. కావున మీరు సదా అల్లాహ్ తఆలా కరుణపై దృష్టి సారించుము. మీ దృష్టి సదా అతని చేతుల వైపు యుండవలెను. అల్లాహ్ తఆలా ద్వారము నుండి బయటికి వచ్చిన తరువాత మరే ద్వారము నా కొరకు తెరుచుకోదని భావించినప్పుడే అల్లాహ్ తఆలా అనుగ్రహమును అతడు ఆకర్షించును. అందుకే మీ చూపు ఎల్లప్పుడు అల్లాహ్ తఆలా వైపు యుండవలెను.ఎప్పటివరకు నీవు నీ దృష్ఠిని అతనివైపే కేంద్రీకరించెదవో అప్పటివరకు నీవు రక్షణలో ఉండెదవు. ఎందుకనగా ఎవరి దృష్ఠి దేవుని వైపు కేంద్రీకృతమై ఉంటుందో అతనికి నష్టమును ఎవరు కల్గించలేరు. కాని ఎప్పుడైతే దృష్ఠి అల్లాహ్ తాలా నుండి ప్రక్కకు మళ్ళునో, అప్పుడు ఆ వ్యక్తి ఎన్ని సత్కార్యములు చేసిన వాడైనను, ఎంతో సదుద్దేశమును కల్గి యున్నను, అతనికి ఆశ్రయము ఎక్కడ లభించదు. అంతేగాకుండ అతను షైతాన్ ప్రక్కలో చేరెదను.( సేకరణ: ఖుత్బాతే మహమూద్ , సంపుటి 17, పుట 216-217) కావున సదా పశ్చత్తాపము. క్షమాపణ, అల్లాహ్ తఆలాతో అనుగ్రహమును కోరుచు, అతని దయను ఆశించుచు, అతన్ని ఆకర్షించుటకు ప్రయత్నించినప్పుడే అంతము విజయవంతమగును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వినిపించిన మరొక ఘటనను హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర.అ) ఇట్లు వినిపించిరి: హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అనుహు లేదా హజ్రత్ ఉమర్ రజియల్లాహ్ తాలా అనుహు ( నాకు సరిగా గుర్తుకు లేదు) గారి ఇంట్లో దొంగలు పడిరి, వారి ఆభరణములను దోచుకెళ్ళిరి, అందుకు వారి సేవకుడు ఒకరు అల్లాహ్ తాలా గారి ఖలీఫా గారి ఇంట్లోనే దొంగతనం చేసే దుర్మార్గుడు కూడ ఈ ప్రపంచములో ఉన్నాడా, వాడికి ఏ మాత్రం సిగ్గులేదా అని తిట్టుచుండెవాడు. ఆ సేవకుడు దొంగతనం చేసిన వారిపై వారి దొంగతనం తొందరగా బయటపడాలి, వాడు తొందరగా నాశనం కావాలి అని శాపనార్ధములు పెట్టుచుండెవాడు. చివరికి అన్వేషించగా, అన్వేషించగా ఒక యూదుని వద్ద ఆ ఆభరణములను తాకట్టు పెట్టినట్లు తెలుసుకున్నారు. అప్పుడు ఆ యూదున్ని నీవద్ద దీనిని ఎవరు తాకట్టు పెట్టినారని నిలదీయగా ఆ యూదుడు శాపనార్ధాలు పెట్టుచున్న ఆ సేవకుని నామమునే చెప్పెను.

కావున కేవలం నోటితో శాపనార్ధాలు పెట్టడం, నోటితో కేవలం విధేయున్ని అని వాగ్దానాలు చేయడం వంటివి నిష్ప్రయోజనాలే. ఆచరణయే ముఖ్యమైనది. అలా కాకుండ కేవలం నోటితో విధేయుడనని వాగ్దానాలు చేయువారే కొన్ని సందర్భాలలో అందరికన్న పెద్ద కపటులగుదురు.

( సేకరణ: ఖుత్బాతే మహమూద్, సంపుటి 17, పుట 516)

| | |
|---|---|
| **అహ్‌దీస్ బోధనలు** | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణవేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)***

కావున ఇది చాలా ఆలోచించుకోవలసిన అంశం. దీనివైపు ప్రత్యేక శ్రద్ధను చూపవలెయును.

అహ్మదియ్యత్‌కు శత్రువైన ఒక వ్యక్తి గురించి ప్రస్తావించుచు హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. మేము అహ్మదియ్యత్‌ను తొక్కి వేయుదుమని తీర్మానించినామని అతడు సవాలు విసిరెను. నీవు తొక్కి చూడుమని నేను కూడ అతనికి సమాధానము ఇవ్వవచ్చును. కాని అతనితో నేనిట్లంటిని. ఒకరిని అంతము చేయడం, చేయక పోవడం అల్లాహ్ తఆలా అధికారములో గలదు. అతడు అనగా అల్లాహ్ తఆలా అంతము చేయదలచినచో మీలోని ఎవరు ప్రయత్నించవలసిన అవసరము లేదు. అతడు స్వయముగా అంతమొందించును. కాని అతడు మమ్ములను కాపాడదలచినచో ఎవరు అంతము చేయలేరు. నేనది చేయుదును, నేనిది చేయుదునని అనే ప్రగల్భాల నుండి ధర్మబద్ధతయే రక్షించును. ధర్మబద్ధతయే మనకు సరైన సమాధానంను నేర్పును. అందువలనే హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ ( ర.అ) అతనికి ఇలా సమాధానం ఇచ్చిరి: మేము ఏమి చేయలేము. ఒకవేళ అల్లాహ్ తాలా మమ్ము కాపాడ దలచినచో మీరు మమ్ములను ఏమియు చేయలేరు. మమ్ము మీరు ఆపలేరు. నేనది చేయుదును, నేనిది చేయుదునని అనే ప్రగల్భాల నుండి ధర్మబద్ధతయే రక్షించును. కేవలం వాగ్దానాలు ఏ ప్రయోజనాన్ని చేకూర్చలేవు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పిరి: ఖాదియాన్ లేదా మరొక ప్రాంతములో గత్తర వ్యాధి ప్రభలినది. జనాజ సమయంలో జనాజను ఎత్తుకునే వ్యక్తి ఒకరు ఇలా అనిరి, వీరే స్వయంగా మరణించుచున్నారు. గత్తర వ్యాధి ప్రభలినప్పుడు కూడ ప్రజలు తినడం, త్రాగడం వీడడం లేదు. కడుపు నిండ తినుచున్నారు. కనీసం ఇవి గత్తర ప్రభలిన రోజులని కూడ ఆలోచించడం లేదు. మమ్ము చూడుము, మేము ఎంత అల్పాహారమును తీసుకొనుచున్నామో, కేవలం ఒకే ఒక చపాతిని భుజించుచున్నాము, కాని ఈ దుర్మార్గులు బలవంతముగా లోనికి నెట్టుచు తినుచున్నారు. గత్తర వ్యాధి సోకగానే మరణించుచున్నారు అని అనేవాడు. మరుసటి రోజు మరో జనాజ రావడంతో ప్రక్కన ఉండేవారు రోజు అతని మాటలు వినలేక విసుగు చెందేవారు. కావున వారిలో ఒక వ్యక్తి ఈ జనాజకు చెందిన వ్యక్తి ఎలా ఉన్నాడని ప్రశ్నించగా, జనాజను మోయువారిలో ఒకరు ఈ వ్యక్తి అల్పాహారము తీసుకునే వ్యక్తి వలే ఉన్నాడు అని సమాధానం ఇచ్చెను. కావున మేము అది చేస్తాము, మేము ఇది చేస్తాము అని అనవసరపు సవాల్లు విసరడం ఏం ప్రయోజనాన్ని ఇస్తుంది. కాని అల్లాహ్ తాలా మాకు ఏమి చెబుతే మేము కూడ ఫలాన జరుగుతుందని చేబుతాము. అల్లాహ్ తాలా చెప్పినవన్ని దాచిపెట్టడం దాసత్వం అనబడదు. అల్లాహ్ తఆలా ఇట్లనెను. كَتَبَ اللّٰهُ لَاَغۡلِبَنَّ اَنَا وَرُسُلِىۡ అనగా నేను, నా ప్రవక్తలు జయింతుమని అల్లాహ్ తఆలా వ్రాసిపెట్టెను. ఒకవేళ ఇప్పుడు ఎవరైన మేము మిమ్ములను తొక్కివేయుదు మని అన్నచో, అది నా శక్తికి సంబంధించిన విషయమైనచో నేను ఏమియు చేయలేను. కాని పైన తెల్పిన అల్లాహ్ ఆదేశము అహ్మదియ్యత్‌కు కూడ వర్తించినచో మమ్ములను ఎవరు ఏమి చేయలేరు. అహ్మదియ్యత్ తప్పకుండ ఒకరోజు విజయమును సాధించును. ఇన్షా అల్లాహ్. ( సేకరణ: ఖుత్బాతే మహమూద్ సంపుటి 17, పుట 343) మన ప్రాణముల కంటే ఎక్కువ అల్లాహ్ తఆలా వాగ్దానములపై మనకు నమ్మకము గలదు. అహ్మదియ్యత్ తప్పక విజయము సాధించును.ఈ విజయము మన జీవితములో రావచ్చును లేదా తరువాత వచ్చును. కాని మనసంతానం ఈ విజయమును తిలకించుటకు, మనము ఈ విజయములో భాగస్వాములగుటకు నిష్ఠాపరతపై నిలబడవలసిన అవసరమున్నది.

దు:ఆలు ఏవిధముగా చేయాలి, అహ్మదీయులకు ఎదురవుతున్న ఈ కష్టాలనుండి ఏవిధముగా బయట పడాలి అనే అంశాలను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిన విధాలను గుర్తు చేస్తు హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర.అ) ఇలా సెలవిచ్చిరి: ఒక తల్లి తన బిడ్డపై చూపించు ప్రేమయే ఈ ప్రపంచములో స్వచ్ఛమైన ప్రేమకు ఉదాహారణగా మనము గుర్తించవచ్చును, లేదా తల్లికి తన కుమారుడిపై గల ప్రేమను ఉదాహారణగా చెప్పుకోవచ్చును. కొన్ని సమయాలలో తల్లి ఎదలో పాలు ఉండవు, కాని పిల్లవాడు గుక్కపెట్టి ఏడవడం వలన ఎదలోకి పాలు వచ్చును. ఏ విధముగానైతే పిల్లవాడు ఏడవకుండ తల్లి ఎదలో పాలు రావో, అదే విధముగా అల్లాహ్ తాలా తన అనుగ్రహమును భక్తుని ఆర్తనాధలతో ముడిపెట్టి యున్నాడు. భక్తుడు ఆర్తనాధాలు మొదలు పెట్టగానే భగవంతుని అనుగ్రహములు కురవడం మొదలవును. అందుకే నేను తెల్పినట్లు మన నుంచి పూర్తిగా చివరి వరకు ప్రయత్నములు కొనసాగుచుండ వలెను. కాని కపటుల ప్రయత్నములు కాకూడదు. మన ప్రయత్నముల తదపరి మనకు సాధ్యమైనంత వరకు దు:ఆల ద్వారా చివరి వరకు ప్రయత్నములు కొనసాగించవలెను.

హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ ( ర.అ) ఆ కాలంలో కూడ 7 ఉపవాసములు ఉండమని మరియు దు:ఆలు చేయమని ప్రోత్సహించిరి. కొన్ని సం॥ల క్రితం జమాఅత్ సభ్యులకు ఉపవాసములు ఉండవలెనని నేను కూడ చెప్పితిని.

( ఖుత్బాతే మస్రూర్ సంపుటి9, పుట 501- 502)

దీనిని ఆచరించువారు జమాఅత్‌లో ఇప్పటికి కొందరున్నారు. కనీసం మనమిప్పుడు 40 ఉపవాసములు వారానికొకటి చొప్పున అనగా ప్రత్యేకముగా 40 వారాల వరకు ఉపవాసము లుండవలెను. దుఆలు చేయుము, నఫిల్ నమాజులు చదువుము, దానములు చేయుము, ఎందుకనగా జమాఅత్‌లలో కొనసాగుచున్న స్థితులను బట్టి కొన్ని చోట్ల చాలా కఠినత్వము వచ్చుచున్నది. ఏవిధముగా పిల్లవాడు రోధించినప్పుడు తల్లి ఛాతిలో పాలు వచ్చినట్లే మనము అల్లాహ్ తఆలా ఆస్థానములో రోధించినప్పుడు ఆకాశము నుండి మన పోషకుని సహాయము అవతరించును. ఇన్షాఅల్లాహ్. మన మార్గములో గల అవరోధములు, కష్టములు దూరమగును. గతములో కూడ దూరమైనవి, ఇప్పుడు కూడ ఇన్షాఅల్లాహ్ దూరమగును.

హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర.అ) ఇట్లనిరి. కొన్ని కష్టములను దూరము చేయుట మన పరిధిలో యుండదు. మనము శత్రువు నాలుకను మూయలేము. అతని కలమును నిలువరించలేము. వారి నాలుక, కలము నుండి వెలువడే దానిని వినే, చదివే సాహసము మనము చేయలేము. ( నేడు మనము చూస్తున్నట్లుగా పాకిస్థాన్‌లో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి వ్యతిరేకంగా చాలా దారుణమైన పదజాలంతో గోడ పత్రాలు అంటించుచున్నారు. ఆంగ్లేయుల అధికారంలో కూడ అధికారులకు ఈ విషయంను గూర్చి పిర్యాదు చేయడమైనది. కాని వారు విని కూడ విననట్లే ప్రవర్తించేవారు, చెవిటి వారి వలే వినేవారు) హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర.అ) మరల ఇలా తెల్పిరి: ఆ దారుణమైన పదజాలంనే ఆ కాలంలో కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్ల ఉపయోగించేవారు. ఒకవేళ ఆ పదజాలంను మరే ఇతరులకు ఉపయోగించిన దేశమంతయు మంటలు రాజుకొనేవి. అలాంటివి పదే పదే వారు ఆ పదజాలంను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్ల ఉపయోగించే వారు. అయిన కూడ వారికి వ్యతిరేకంగా ఏనాడు కూడ చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. ( ఆ కాలపు విషయం ఇది) అంతేగాకుండ కొందరు అధికారులే అహ్మదీయులకు వ్యతిరేకంగా ఏమి చేసిన ఎలాంటి చర్యలు తీసుకోబడవని, కావున మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి అని నమ్మకంను కల్గించినట్లు కూడ నాకు తెలిసినది.

( సేకరణః ఖుత్బాతే మహమూద్ సంపుటి 17, పుట 152-153)

గతంలోకూడ ఇలాంటి నడవడే ఎదురైనది. అయినను అల్లాహ్ తాలా అనుగ్రహము వలన ప్రతి ఆటంకమునకు ఫలితముగా జమాఅత్ అభివృద్ధి చెందినది. ఇది ఆ కాలం నాటి ప్రభుత్వ విధానం, ఆనాడు ఎలాంటి చట్టాలు చేయబడలేదు. కాని పాకిస్తాన్‌లో అహ్మదీయులకు వ్యతిరేకంగా చట్టము గలదు. వ్యతిరేకులకు ఆ చట్టము సహకరించును, వ్యతిరేకులు తలచినది చేయుదురు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు వ్యతిరేకంగా నోటికి వచ్చినట్లు దూషింతురు. అహ్మదీయులను హింసలకు గురిచేయుదురు. న్యాయస్థానములు కూడ ఇప్పుడు చిన్న చిన్న విషయములపై శిక్షించుటకు కంకణం కట్టుకొన్నవి. కావున మనము అల్లాహ్ తఆలా ఆస్థానములో అధికముగా రోధించవలసిన అవసరమున్నది. ప్రత్యేకముగా పాకిస్తాన్ అహ్మదీయులు గతము కంటే అధికముగా ఇటువైపు దృష్టి సారించవలెను. విధేయతతో అల్లాహ్ తఆలా ఆస్థానములో మోకరిల్లుము. నవాఫిల్ చదువుచు దానములు చేయుము, ఉపవాసములుండుము. దుఆలు చేయుచు అల్లాహ్ తఆలా కరుణను ఉప్పొంగించనిచో మనకు మరో మార్గము లేదు. ఎక్కడెక్కడ అహ్మదీయులపై ఈ హింసలు జరుగుచున్నవో, ఏ ఏ దేశములలో, ఏ ఏ ప్రాంతములలో ఈ హింసలు జరుగుచున్నవో అక్కడి అహ్మదీయులకు అల్లాహ్ తఆలా ఇటువంటి దుఆలు చేయు అనుగ్రహమిచ్చు గాక! అవి అల్లాహ్ తఆలా సింహాసనమును కదిలించుగాక! ఇతర అహ్మదీయులు కూడ జమాఅత్ ప్రగతి, హింసల నుండి మోక్షము పొందుటకు దుఆల వైపు ప్రత్యేక శ్రద్ధ వహించుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! (ఆమీన్).

**అస్తగ్ ఫిరుల్లాహ రబ్బీ మిన్‌కుల్లి జన్‌బిన్ వ అతూబు ఇలైహి.**

అనువాదము: నా పాపముల క్షమాపణ కొరకు అల్లాహ్‌ను యాచింతును. అతడు నా ప్రభువు! అతని వైపే నేను మోకరిల్లుతును.

**గేండియా దేశానికి చెందిన 15 మంది పాత్రికేయులతో హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆన్ లైన్ సమావేశం:**

22 మే 2021 నాడు అహ్మదియ్య ముస్లిం జమాఅత్ ఇమాం హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారితో మొదటి సారి గాంబియా దేశానికి చెందిన 15 పాత్రికేయులతో ప్రెస్ కాన్ఫెరెన్స్‌ను నిర్వహించడం జరిగింది. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ కార్యాలయమైన టిల్‌ఫోర్డ్‌లో ఈ కాన్ఫెరెన్స్‌కు అధ్యక్షతను వహించారు. పాత్రికేయులు మాత్రం గేంబియా స్టూడియో (బాంజిల్) నుండి ఎం.టి.ఏ ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

55 నిమిషాలతో కూడిన ఈ సమావేశంలో పాత్రికేయులు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారిని ప్రశ్నలు అడిగారు. ఆయా ప్రశ్నలలో పశ్చిమ దేశాలలో నేడు నెలకొన్న దౌర్జన్యాలు, దాడులను, ముస్లిం దేశాలలో ఐక్యత లేకపోవడం, ప్రపంచ శాంతికి సంబంధించిన అంశాలపై ప్రశ్నల పరంపర కొనసాగింది.

హుజూర్ అన్వర్ గారి పుస్తకం వర్ల్డ్ క్రైసెస్ అండ్ పాత్‌వే టూ పీస్ ను ఆధారం చేసుకొని ఒక పాత్రికేయుడు సమాజంలో న్యాయ, ధర్మంను నెలకొల్పడం కోసం హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా నిరంతరం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధను గూర్చి ప్రశ్నించారు. అందుకు హుజూర్ అన్వర్ గారు ఈ విధముగా సమాధానం ఇచ్చారు. శాంతి స్థాపన కోసం న్యాయబద్ధత ప్రాథమిక ప్రామాణికం అవుతుంది. కుటుంబ సమస్యల నుండి అంతర్జాతీయ్య స్థాయి మేరకు గల సంబంధాలలో నిజమైన నిష్పాక్షమైన న్యాయబద్ధత సమాజంలోని అన్ని వర్గాల వారికి లభించినప్పుడే సమాజం కూడ వాస్తవ రూపంలో సంతోషంగా ఉంటుంది.

ప్రపంచ పరిస్థితులను గూర్చి మాట్లాడుతూ హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: " అంతర్జాతీయ్య వ్యవహారాలను చూసినచో న్యాయబధతను అనుసరించ నంత వరకు ప్రపంచ శాంతి నెలకొనలేదు. మనం నేడు చూస్తున్నట్లుగా ఒకవేళ వారు రెండు రకాల పాలసీలను అనుసరించుచున్నచో, అగ్రరాజ్యాలకు వత్తాసు పలుకుచున్నచో వారు ప్రపంచంలో శాంతిస్థాపనను నెలకొల్పలేరు. లీగ్ ఆఫ్ నేషన్స్‌ను స్థాపించిన తరువాత కూడ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అన్ని దేశాలకు సమానమైన హక్కులు, సరైన న్యాయాన్ని అందించడానికే లీగ్ ఆఫ్ నేషన్స్‌ను ఏర్పాటు చేశారు. అయినా కూడ అది ఫలించలేదు. దాని దుష్పరిణామంగా ప్రపంచం రెండవ ప్రపంచ యుద్ధానికి గురైనది.

నేటి కాలంలో అంతర్జాతీయ్య న్యాయస్థాన వ్యవహారశైలి, మరియు లీగ్ ఆఫ్ నేషన్స్ యొక్క అపజయాలను చర్చిస్తూ హుజూర్ అన్వర్ గారు ఇలా తెలిపారు: నేటి అంతర్జాతీయ న్యాయస్థాన పరిస్థితులు కూడ ఇలాగే ఉన్నాయి. వారు న్యాయముగా వ్యవహరించడం లేదు. అగ్ర రాజ్యాలకు, చిన్న రాజ్యాల విషయంలో వారికి రెండు విధాల పాలసీలు ఉన్నాయి. అనగా పాశ్చిమ దేశాలకు ఒక విధానం, ఆఫ్రీకా మరియు ఆసియా దేశాల కోసం మరో విధానంను అనుసరిస్తున్నాయి. ఈ కారణం చేతనే మనం నేడు ప్రపంచంలో అశాంతిని చూస్తున్నాము. కావున న్యాయ బద్ధత లేకుండా శాంతిని నెలకొల్పడం అసాధ్యం. ఈ కారణం చేతనే పవిత్ర ఖుర్ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మీరు స్థానికముగా, కుటుంబ పరంగా మరియు అంతర్జాతీయ పరంగా న్యాయబద్ధతను పాటించుము. అప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని తెలిపారు.

ఒక పాత్రికేయుడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఒక హదీస్‌ను ప్రస్తావించుతూ ఇలా ప్రశ్నించాడు. ఒకవేళ మీరు చెడును చూసినచో దానిని మీరు మీ చేతులతో అడ్డుకొనుము, ఒకవేళ మీరు అలా చేయలేకున్నచో నచ్చజెప్పి చూడుము, అలా కూడ చేయుటకు ఎవరికైన ధైర్యం లేకున్నచో కనీసం మనస్సులోనైన చెడుగా భావించుము అని గలదు. ఆ తరువాత ఆ పాత్రికేయుడు అహ్మదియ్య ముస్లిం జమాఅత్ ఫలస్తీన్‌లోని క్లిష్ట పరిస్థితులను దూరం చేయడం కోసం చేసిన ప్రయత్నాలను గూర్చి వారు ఏమి చేశారు? ఏమి చేస్తున్నారు? అని ప్రశ్నించాడు. అందుకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఈ విధముగా సమాధానంను ఇచ్చారు. తమ పరిదిలో ఉంటూ అహ్మదియ్య ముస్లిం జమాఅత్ ఫలస్తీన్‌ల హక్కుల కోసం గళమెత్తుతున్నది. అన్ని రకాల అన్యాయాలను వ్యతిరేకించినది.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: మా వద్ద ప్రాపంచిక పరమైన ఎలాంటి బలం లేదు. మేము ఏ దేశంలో ప్రభుత్వాన్ని కొనసాగించడం లేదు. ఇక అధికారంను గూర్చి చూసినచో మేము దానిని ఉపయోగించలేము. ఇక ఈ దౌర్జన్యంను అసాంఘికముగా భావించు విషయానికి వచ్చినచో లేదా దీనిని నోటి మాటల ద్వారా అడ్డుకోను విషయానికి వచ్చినచో మేము చాలా కాలం నుండి ఈ రకమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. నా గత సంవత్సరపు పండుగ ప్రసంగంలో కూడ నేను ఫలస్తీనులపై మోపబడే దౌర్జన్యాలను, దాడులను తీవ్రముగా ఖండించాను. ఇరు పక్షాలవారి బలంను చూసినచో ఏ మాత్రం పోలిక లేదు. ఇజ్రాయిల్ ప్రపంచంలోనే నాలుగవ అతి పెద్ద దేశం. ఫలస్తీన్ కేవలం ఒక చిన్నపాటి మరియు నిరాయుధాలు కల్గిన దేశం. వారు సమాన స్థాయిలో సమాధానం ఇవ్వలేని స్థితిలో ఉన్నారు. వారు కేవలం ఈ దౌర్జన్యానికి గురవుచున్నారు.

ఫలస్తీనీయుల హక్కుల కోసం అత్యధిక జనాభ గల ముస్లిం దేశాల ఐక్యత చాలా ముఖ్యమని తెల్పుచు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఈ విధముగా తెలిపారు: ప్రపంచంలో సుమారు 54 ముస్లిం దేశాలు ఉన్నాయి. ఒకవేళ అవన్నియు ఐక్యమత్యంతో ఒక నిర్ణయానికి కట్టుబడి యున్నచో , అందరు కలసి కట్టుగా ప్రపంచంలో శాంతిని నెలకొల్పుటకు ప్రయత్నించినచో అప్పుడు ఫలస్తీనీయులకు హక్కులు లభిస్తాయని చెప్పుకోవచ్చును. కాని విచారకరమైన అంశం ఏమిటనగా ముస్లిం సమాజం ఐక్యం కావడం లేదు. ప్రతి ముస్లిం నాయకుడు తమ స్వప్రయోజాల కోసం పని చేస్తున్నాడు. మన వ్యతిరేకులు కూడ ఈ విషయాన్ని గ్రహించారు. ఇస్లాంను వ్యతిరేకించు వారు కూడ ముసల్మానులు ఎన్నడు ఐక్యం కాలేరు కావున మనకు ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చును అని భావిస్తున్నారు. అందుకే ఈ పరిస్థితులను మార్చుకోవడం కోసమైన ముస్లింలందరు ఏకం కావలసి యున్నది.

ముస్లిం దేశాలు ఏ విధముగా ఒకే తాటిపైకి రాగలవు? అనే ప్రశ్నకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఈ విధమైన సమాధానం ఇచ్చారు: ప్రతి ముస్లిం నాయకుడు ముస్లిం సమాజ ప్రయోజనాలకు తమ వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలపై ప్రాధాన్యత నివ్వవలెను.

మరల హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: ముస్లిం ప్రపంచ విభజన, విభేదాలు అన్ని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణులకు అనుగుణముగానే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులలో మసీహ్ మవూద్ అవతరణ కూడ చాలా అత్యవసరం. అదే విధముగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణుల ప్రకారం మసీహ్ మౌవూద్‌ను విశ్వసించి, వారి బోధనలకు అనుగుణముగా నడుచుకున్నప్పుడే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: అందుకే ముస్లిం సమాజం ఐక్యమత్యంగా ఉండాలి. అల్లాహ్ తాలా మరియు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనే నేటి కాలపు సమస్యలకు చూపిన పరిష్కారమేమనగా ఈ కాలపు ముజద్దిద్ అవతరించినప్పుడు వారిని స్వీకరించాలి. నా దృష్టిలో ఇదొక్కటే నేటి సమస్యలన్నింటికి పరిష్కార మార్గం.

(తదుపరి సంచికలో చదువుము)

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

**నూరుల్ ఇస్లాం శాఖ:**

అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).

**సహ్‌రీ ప్రాముఖ్యత:-**

ఉపావాసం ఉండే సంకల్పముతో ఉషోదయానికి పూర్వం తీసుకునే అన్నపానియాలనే సహ్‌రీ అంటారు. సహ్‌రీ భుజించడం సున్నత్ (సాంప్రదాయం). మహా ప్రవక్త సల్లల్లాము అలైహి వసల్లం స్వయముగా సహ్‌రీని భుజించేవారు. తమ అనుచరులను కూడ సహ్‌రీ భుజించాలని తాకీదు చేసేవారు. వారు (స) ఇలా ప్రవచించారు.

" మనం సహ్‌రీని భుజిస్తాం. ఇతర గ్రంథగ్రస్థులు (యూదులు, క్రైస్తవులు) సహ్‌రీని భుజించరు. ఇదే మనకు వారికి మధ్య ఉన్న వ్యత్యాసం."

**మరొక ఉల్లేఖనంలో ఇలా గలదు:**

"సహ్‌రీని భుజించండి, సహ్‌రీ భుజించడంలో ఎంతో శుభం గలదు." (ముస్లిం)

" రాత్రి వేళ ప్రార్థనల కోసం పగటి నిద్ర ద్వారా శక్తి పొందండి. పగటి వేళ రోజా పాటించుటకు సహ్‌రీని భుజించండి. "

(ఇబ్నేమాజా)

**సహ్‌రీ భుజించు సమయం:-**

సహ్‌రీ ఆలస్యముగా తినడం సున్నత్. ఇక్కడ ఆలస్యముగా అనగా ఉషోదయానికి కొన్ని నిమిషాలు ముందుగా అని అర్థం. కొందరు అర్థ రాత్రికే, మరి కొందరు ఉషోదయానికి చాలా సమయం ముందే సహ్‌రీ తినడం ముగిస్తారు. ఇది మంచి పద్ధతి కాదు. సహ్‌రీ వేళ మరి కొన్ని క్షణాలలో పూర్తి అవుతుందని భావించిన వేళ సహ్‌రీ తినడం పూర్తి చేయాలి. ఇలా ఆలస్యముగా భుజించడమే పుణ్యప్రదమైనది.

హజ్రత్ అనస్ (రజి) ఇలా ఉల్లేఖించిరి:-

" హజ్రత్ జైద్ బిన్ సాబిత్ ఇలా తెల్పిరి. మేము దైవ ప్రవక్త సల్లల్లాము అలైహి వసల్లంతో సహ్‌రీ భుజించాము. ఆ తరువాత వెంటనే హుజూర్ (స) ఫజర్ నమాజ్ కోసం లేచి నిలబడిరి."

మరల హజ్రత్ అనస్ (రజి) ఇలా ఉల్లేఖించిరి:- " నేను జైద్ బిన్ సాబిత్‌ని ఉద్దేశించి సహ్‌రీకి, ఫజర్ అజాన్‌కు మధ్య ఎంత సమయం ఉండేది?. అని ప్రశ్నించాను. అందుకు జైద్ కేవలం ఐదు పవిత్ర ఖుర్‌ఆన్ సూక్తులను పఠించే సమయం ఉండి ఉంటుంది అని సమాధానం ఇచ్చిరి."

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటనగా 5 పవిత్ర ఖుర్‌ఆన్ సూక్తులను పఠించుటకు అధికముగా 5 నుండి 7 నిమిషాలు పట్టవచ్చును. కావున దీనిని బట్టి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహ్‌రీని ఎంత ఆలస్యముగా భుజించేవారో తెలుస్తుంది. కావున ఫజర్ అజాన్‌కు 5 నుండి 10 నిమిషాల ముందు వరకు సహ్‌రీని భుజించ వచ్చును.

**నియ్యత్:- (సంకల్పం)**

ఉపవాసము పాటించుటకు నియ్యత్ (సంకల్పం) చేసుకోవడం కూడ తప్పనిసరి. ఉపవాస సంకల్పం రాత్రివేళ యందు లేదా సహ్‌రీ భుజించిన తరువాత అయినా చేసుకొచ్చును.

నియ్యత్ (సంకల్ప దుఆ) పదాలు ఈ విధముగా గలవు. **"వవ అయితు అన్ అసూము ఘదన్ లిల్లాహి తఆలా మిన్ సౌమి రమజాన్."** లేదా **" వవఅయితు బి సౌమిన్ ఘదన్ "** అని కూడ ఉచ్చరించవచ్చును.

కొన్ని సందర్భాలలో అనివార్య కారణాల వలన తెల్లవారు జామున పెందలాడ నిద్ర నుండి లేవలేకపోయినచో సహ్‌రీ భుజించలేదు కదా అని ఉపవాసంను మానుకోకూడదు. శక్తి ఉన్నచో నియ్యత్‌ను పఠించి ఆ రోజునాటి ఉపవాస దీక్షను పూర్తి చేయవచ్చును. లేదా ఆలస్యముగా తెల్లవారిన తరువాత లేచినందున ఒక గ్లాసు మంచి నీటిని లేదా పాలు త్రాగి నియ్యత్ పఠించి ఉపవాసమును పూర్తి చేయవచ్చును. అంతేగాని ఆరోజు ఉపవాసంను వదిలి వేయడం పాపమవుతుంది.

**ఇఫ్తార్:- (ఉపవాస విరమణ)**

కొందరు ఇఫ్తార్‌ను చాలా ఆలస్యముగా చేస్తుంటారు. ఇది మంచి పద్ధతికాదు. నిర్ణయిత సమయంలో ఇఫ్తారు చేయడం మంచి పద్ధతి. ఇఫ్తార్ ఖర్జూర పండ్లతో చేయడం సున్నత్. ఒకవేళ ఖర్జూర పండ్లు లభించనిచో నీళ్ళతో గాని, పాలతో గాని అతి సులువుగా లభించు పదార్థముతో గాని ఇఫ్తార్ చేయవచ్చును. అంతేగాని ఇతర పదార్థాలతో ఇఫ్తారు చేసినచో భక్తి పరాయణకు అనువైనది కాదని భావించకూడదు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖర్జూర పండ్లతో, మంచినీటితో ఇఫ్తార్ చేయమని తమ అనుచరులకు తాకీదు చేయడం కూడ వాస్తవమే. ఇందుకు కారణం అరబ్ దేశంలో ప్రతి ఇంటా ఖర్జూర పండ్లు సులభముగా లభించే అవకాశమున్నది. ఆపై అరబ్బులకు ఇది ఎంతో ఇష్టమైన అహారం.

ఇఫార్ చేయించడం కూడ పుణ్యకార్యమే. ఒక్క ఖర్జూర పండుతో ఇఫ్తార్ చేయించినను అది ఎంతో పుణ్యప్రదం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించినారు:

" ఉపవాసికి ఇఫ్తార్ చేయించడం ఆని లేదా ముజాహిద్‌కు జిహాద్ సామాగ్రినివ్వడం గాని చేసిన వ్యక్తికి ఉపాసకుడికి, ముజాహిద్‌కు లభించేటంత పుణ్యఫలం లభిస్తుంది. "

**ఇఫ్తార్ దుఆ:**

ఇఫ్తార్ చేసే ముందు ఈ దుఆ పఠించాలి.

**" అల్లాహుమ్మ లకసుమ్తు వ అలా రిజ్‌ఖిక్ అఫ్తర్తు."** (అబూదావూద్)

అనువాదం: ఓ అల్లాహ్! నేను నీ ప్రసన్నత కోసమేఉపవాసమును పాటించాను. నీవు అనుగ్రహించిన ఆహారంతోనే ఉపవాసం విరమిస్తున్నాను.

**ఉపవాసాన్ని భంగపర్చే విషయాలు:-**

1, అనవసరముగా నోటిలో ఉమ్మిని పోగుచేసి మింగడం.

2,వజూ సందర్భములో పుక్కిలించేటప్పుడు గాని, ముక్కులోకి నీరు ఎక్కించేటప్పుడు గాని నిర్లక్ష్యముగా వ్యవహరించటం.

3, పదే పదే ఆందోళన చెందం, కంగారు పడడం, భయపడడం.

4, పళ్ళపొడితో లేదా బొగ్గుతో పళ్ళు తోముకోవడం.

**ఉపవాసాన్ని భంగపర్చని విషయాలు:-**

1, ఉపవాస స్థితిలో మరచిపోయి ఏదైనా తినడం, త్రాగడం చేసినకూడ ఎలాంటి భంగం వాటిల్లదు.

2, పగటి పూట నిద్రించినప్పుడు స్నాను చేయవలసిన పరిస్థితి ఏర్పడడం (స్వప్న స్ఖలనం కావడం).

3, కళ్ళకు సుర్మా లేదా కాటుక పెట్టుకోవడం, తలకు నూనే రాసుకోవడం, సుగంద పరమళాల వాసన చూడడం, శరీరాన్ని మాలిష్ చేయడం మొ॥నవి.

4, ఉమ్మినీటిని, కఫాన్ని (తెమడం) మింగడం.

5, ఈగ గాని , దోమగాని, దుమ్ము కణాలు గాని నోటిలోకి వస్తే అప్రయత్నముగా మింగి వేయడం, అలాగే చుట్ట, బీడి సిగరేట్‌పొగ లేదా మరేదైనా పొగ గొంతులో దిగిపోవడం.

6, చెవిలో నూనేగాని, నీరుగాని దానంతటది పోవడం.

7, అప్రయత్నంగా వాంతి కావడం.

8, పళ్ళుతోము పుల్ల వాడటం వలన.

9, తీవ్రమైన ఎండ తాకిడికి తట్టుకోలేక నోటితో పుక్కిలించడం, ముఖం కడుక్కోవడం, స్నానం చేయడం, తడి గుడ్డను కప్పుకోవడం.

10, ఎవరినైన ముద్దు పెట్టుకోవడం వలన గాని ఉపవాసానికి ఎలాంటి భంగము వాటిల్లదు.

**ఎలాంటి పరిస్థితులలో ఉపవాసాన్ని భంగం చేయవచ్చును:-**

కొన్ని సందర్భాలలో ఊహించని పరిణామాలు ఏర్పడుతుంటాయి. మానవుడు ఆరోగ్యవంతునిగానే ఉన్నాను కదా అని ఉపవాస దీక్షను ప్రారంభించడం జరుగుతుంది. కాని ఊహించని పరిణామాల వలన, వారి ఆరోగ్యరీత్య ఎదురయ్యే సమస్యల కారణముగా తప్పని పరిస్థితులలో ఉపవాసంను భంగం చేయవలసి


99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka. E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ అశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 7. Thursday, 07 APR 2022 Issue No. 14.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.575/- (Per Issue: 11/- ) (WEIGHT: 20-50, grms / issue)

ఉంటుంది. అందుకు సంబంధించిన కొన్ని విషయాలు మీ ముందు ప్రస్తావించడం జరుగుతుంది.

1, అకస్మాత్తుగా మూర్ఛవ్యాధి గాని లేదా దురదృష్టవశాత్తు ఏదేని ప్రమాదం వాటిల్లినచో ఉపవాసాన్ని భంగం చేయవచ్చును.

2, ఉపవాస దాటికి తట్టుకోలేక విపరీతంగా నీరసించిపోయినచో అన్నపానియాలు సేవించకపోతే ప్రాణమే పోతుందన్నంతగా తీవ్రమైన ఆకలి దప్పికలు ఏర్పడినప్పుడు భంగం చేయవచ్చును.

3, ఎవరికైనా పాముగాని, మరేదైనా విషపురుగు కాటు వేసినచో తక్షణమే మందువాడవలసిన పరిస్థితి ఏర్పడినచో ఉపవాసాన్ని భంగం చేయవచ్చును.

4, ఉపవాస సమయంలో నెలసరి వచ్చినప్పుడు.

తరువాత రోజులలో భంగపర్చిన ఉపవాస దినములను పూర్తిచేసి ఉపవాస వ్రతమును పూర్తి చేయాలి.

**ఉపవాస వ్రతం:-**

అరబీ భాషలో ఉపవాసమును లేదా రోజాను "సౌమ్" అని అంటారు. సౌమ్ అనగా అనవసరపు విషయాలను మాట్లాడకుండా, అన్నపానియాలు సేవించకుండా ఉండటం అని అర్థం. ధర్మ శాస్త్రము ప్రకారము. ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు అన్నపానియాలను, దురలవాట్లను, చెడు సహవాసాలను వదిలివేయడం అని భావం.

ఉపవాసము ఒక నియమబద్ధమైనదై పవిత్రతను వృద్ధి పర్చును. ఆత్మియాభివృద్ధి కోరువారికి ఇది సులభసాధనము. ఉపవాసము ఉన్న వ్యక్తి దేవుని సర్వ కృపావరముల విషయమై తెలసినవాడు కాగలడు. అట్టి కృపావరములను లాభదాయకమైన రీతిని ఉపయోగించుకొనుటకు ఈ ఉపవాసము ఎంతో ఉపకరించును.

**ఉపవాస ఆదేశం:-**

హిజ్రి శకం ప్రారంభమైన 18 నెలలకు మదీనాలో ముస్లింలు రమజాన్ మాసము నందు ఉపవాసాలను విధిగా (ఫర్జ్‌గా) పాటించాలని ఆదేశం వచ్చింది.

**" యా అయ్యు హల్లజీన ఆమనూ కుతిబ అలైకుముస్సియామ్ "** ( బఖ్రాహ్: 183)

అనువాదం: ఓ విశ్వాసులారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది.

రమజాన్ మాసంలో ఉపవాసములను పాటించడం తప్పనిసరి. ఈ విషయమును పవిత్ర ఖుర్ఆన్ మరియు హదీసులలో స్పష్టముగా పేర్కొనబడింది. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం షాబాన్ మాసపు చివరిలో రమజాన్ ప్రాముఖ్యతను తెల్పుచూ ఒకసారి ఇలా ప్రసంగించిరి:

" ప్రజలారా! మీ కోసం ఎంతో శుభప్రదమైన , ఉన్నతమైన ఒక మాసము వస్తుంది. ఆ మాసములో వేయి నెలల కన్న ఉత్తమమైన ఒక రేయి గలదు. దేవుడు ఆ మాసములో మీకు ఉపవాసములను పాటించుటను విధిగావించెను"

(బైహఖీ)

**ఉపవాస ప్రాముఖ్యత:-**

పవిత్ర ఖుర్ఆన్ ప్రకారం ఉపవాస వ్రతం దైవ గ్రంథాలన్నింటిలోను విధిగా నిర్ణయించ బడింది. మానవుని మానసికి, ఆధ్యాత్మిక శిక్షణలకు, ఉపవాస వ్రతానికి ఒక ప్రత్యేక అనుబంధము గలదు. అందుకే అల్లాహ్ తాలా ప్రతి యుగంలో తన దాసుల శిక్షణ కోసం ఉపవాసమును పాటించుటను విధిగా నిర్ణయించాడు దీనికి మరేలాంటి ఆరాధన కూడ ప్రత్యామ్నాయ ఆరాధన కాజాలదు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపవాస వ్రత ప్రాముఖ్యతను తెల్పుచూ ఇలా బోధించిరి.

" ఏ వ్యక్తి అయినా ధర్మశాస్త్ర పరమైన కారణం లేకుండా రమజాన్ మాసములోని ఒక్క ఉపవాసమునైన వదిలి వేసినచో అతను ఆ తరువాత జీవితాంతము ఉపవాసములు పాటించినను అవి వదిలి వాటికి సమానం కాజాలవు. " (తిర్మిజి, అబూదావూద్).

**ఉపవాస వ్రతం:-**

రోజా ఔన్నత్యాన్ని తెలియజేయుచూ మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు:

"మనిషి చేసే ప్రతి సత్కార్యానికి పది నుండి ఏడు వందల రెట్లు పుణ్యఫలం ప్రాప్తమవుతుంది. కాని రోజాను గూర్చి అల్లాహ్ తాలా ఇలా తెలియ జేయుచున్నాడు. రోజా అంశం ప్రత్యేకమైనది. అది కేవలం నా కోసమే పాటించబడుతుంది. నేనే అందుకు ప్రతిఫలమును. దాసుడు నా కోసం మాత్రమే తన కోరికలను, అన్నపానియాలను మానుకుంటున్నాడు. రోజా పాటించే వ్యక్తి రెండు సందర్భాలలో అత్యంతానందం పొందుతాడు. ఒకటి – ఇఫ్తార్ (ఉపవాస విరమణ) సమయములో, రెండవది – సర్వలోకాల సంరక్షకున్ని సందర్శించి నప్పుడు. రోజా పాటించే వ్యక్తి నోటి నుండి వెలువడే వాసన అల్లాహ్‌కు కస్తూరి సువాసన కన్న ఎంతో ప్రీతికరమైనది. రోజా ఒక డాలు వంటిది. రోజా పాటించూ వ్యక్తి అశ్లీల వాతవరణానికి, అలజడికి, గందర గోళంనకు దూరముండాలి. ఎవరైనా దూషించినచో నేను ఉపవాస వ్రతమును పాటిస్తున్నాని సమాధానం ఇవ్వాలి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (ర) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు:

" ఏ వ్యక్తి అయితే పూర్తి విశ్వాస స్పృహతో , ఆత్మ పరిశీలనా భావంతో రమజాన్ రోజాలు పాటిస్తాడో అతను చేసిన పూర్వ పాపాలన్నీ మన్నించబడతాయి." (బుఖారి, ముస్లిం)

ఆత్మపరిశీలనా భావంతో అనగా ఉపవాస వ్రతాన్ని కేవలం దైవ ప్రసన్నత కోసం పరలోక ప్రతిఫలాపేక్షతో మాత్రమే పాటించాలి. రోజా లక్ష్యానికి వ్యతిరేకమైన పనికి మాలిన విషయము లన్నింటిని విడనాడాలి.

**రోజా లక్ష్యం:**

మనిషిలో దైవభీతిని కల్గించడమే రోజా యొక్క లక్ష్యం. రోజా లక్ష్యాన్ని వివరిస్తూ పవిత్ర ఖుర్ఆన్ ఈ విధముగా తెల్పుచున్నది. "మీలో (దైవం పట్ల ) భయభక్తులు జనింప జేయుటకు ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది."

(బఖ్రాహ్:183)

దైవభీతి పారాయతణను తఖ్వా అంటారు. అంటే అంతరంగములో దేవుని పట్ల నిజమైన భయభక్తులు, స్వచ్ఛమైన ప్రేమాభిమానాలు జనించి పెంపొందే సద్గుణ సంపత్తికి మారుపేరే ఈ తఖ్వా. దేవుని పట్ల అచంచల విశ్వాసంతో పాటు, ఆయన మానవ శ్రేయస్సును కోరే మహోపకారి. అమిత దయామయుడన్న పూర్తి స్పృహ కలిగి ఉన్నప్పుడే మనిషిలో నిజమైన ప్రేమభావన పెల్లుభీకుతుంది. అలాగే దేవుడు దుష్టలను, దుర్మార్గులను కఠినముగా శిక్షించు ఉగ్రుడు అనే స్పృహ కలిగి ఉన్నప్పుడే అంతర్యంలో దైవం పట్ల నిజమైన భయభక్తులు జనిస్తాయి.

**1, రబ్బనా అఘ్‌ఫిర్‌లనా జునూబనా వ ఇస్రాఫనా ఫీ అమ్రినా వ సబ్బిత్ అఖ్‌దామనా వన్‌సుర్‌నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్.**

అనువాదము: ఓ మా ప్రభువు మా పాపములను మరియు మా విధి నిర్వాహాన అవకతవకలను క్షమించుము. ( యుద్ధరంగమున) మడమ తిరుగని అడుగులను ప్రసాదించుము. అవిశ్వాసులతో మేము సల్పుచున్న పోరాటమునందు మాకు సహాయమును అందించుము.

**2, యా రబ్బి ఫస్‌మఅ దుఅయీ వ మజ్జిక్ ఆదాఅక వ ఆదాయీ, వఅన్‌జిజ్ వాదక, వ అన్‌సుర్ అబ్దక, వ అరినా అయ్యామకా, వ షహ్హిర్‌లనా హుసామక, వలా తజర్ మినల్ కాఫిరీన షరీరా.**

అనువాదము: ఓ నా ప్రభువా! నీవు నా ప్రార్ధనలను ఆలకించుము.మరియు నీ శత్రువులను, నా శత్రువులను తూనతుకలు చేయుము.మరియు నీ వాగ్దానమును పూర్తిచేయుము. నీ భక్తులకు సహాయమును నొసంగుము. మాకు మా (శుభప్రదమైన) దినములను తిలకింపజేయుము, మా కొరకు నీవు ఖడ్గము చేత భూనుము. ధిక్కరించు వారిలో ఏ ఒక్క దుష్టిడిని వదలకుము.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz